www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 18 | 21-6-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

# వైద్యం.. అభయం!

## పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం 2



- సైన్స్, టెక్నాలజీ సామాన్యుడికి చేరాలి
- పాఠశాలలకు 'విజయ' డెయిరీ పాలు
- పాడి రైతులకు ఆగని చెల్లింపులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర అత్యున్నత అభివృద్ధికి అసలైన గీటురాయి అని, పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్ వేదికగా జరిగిన జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ.. సామాన్యుడికి సైతం అత్యాధునిక సాంకేతిక వైద్యం అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఉద్ఘాటించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆరోగ్య రాజధానిగా అవతరించిందని ఆయన ప్రకటించారు. మరోవైపు క్షేత్రస్థాయిలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలైన పాడి రైతులను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయా డెయిరీ' పాలను సరఫరా చేయాలని నిర్ణయించామని సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన స్పష్టం చేశారు. పాడి రైతులకు ఎలాంటి బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఒకవైపు ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ, ఇంకోవైపు అన్నదాతల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సర్కారు పనిచేస్తోందని భట్టి విక్రమార్క ఈ రెండు వేర్వేరు సమావేశాల ద్వారా దిశానిర్దేశం చేశారు. - హైదరాబాద్, జూన్ 20:



# పరేడ్ గ్రౌండ్‌లో యోగాడే

- ఒకే వేదికపై గవర్నర్, కేంద్ర మంత్రి, వెంకయ్యనాయుడు!
- సికింద్రాబాద్ మైదానంలో జనసముద్రం
- తరలివచ్చిన విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు
- సాధన చేసిన ఎంపీలు ఈటల, లక్ష్మణ్, రామచందర్‌రావు
- సినీ గ్లామర్ జోడించిన నవీన్ పోలిశెట్టి, డింపుల్ హయాతి

2







ఆత్మవిశ్వాసంతో
## రాయండి!
నీట్ విద్యార్థులకు సీఎం శుభాకాంక్షలు 2

## తెలంగాణ స్వాప్నికుడు
ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళి

# కలిసి వెళ్దాం.. మెట్రో నిధులు తెద్దాం 2



- 22, 23 తేదీల్లో నేను ఢిల్లీలోనే ఉంటా..
- మెట్రో రెండో దశపై రైల్వే మంత్రిని కలుద్దాం
- ఒప్పంద పత్రాలతో వస్తా.. ఇద్దరం కలిసి వెళ్దాం
- కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ బహిరంగ లేఖ

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి నిధులు, అనుమతులు సాధించేందుకు ఇద్దరం కలిసి వెళ్దామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఆయన శనివారం ఒక బహిరంగ లేఖ రాశారు. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర సాధనే శ్వాసగా జీవించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా సీఎం ఘనంగా నివాళులర్పించారు. అలాగే, నేడు జరగనున్న 'నీట్' పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. - హైదరాబాద్, జూన్ 20

# ఉపాధికి గండి కొట్టొద్దు!

- వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి
- అరవై రోజుల ఉపాధి విరామంతో పేదలకు తీవ్ర నష్టం
- కేంద్రానికి మూడు లేఖలు రాసిన మంత్రి సీతక్క
- దళితులు, గిరిజనుల ప్రయోజనాలు కాపాడాలని డిమాండ్

2



గ్రామ పంచాయతీలను బలహీన పరిచేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వెంటనే సవరించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ఈ నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ, అందులోని అభ్యంతరాలను వివరిస్తూ కేంద్రానికి మూడు వేర్వేరు లేఖలు రాశామని ఆమె వెల్లడించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల జీవనోపాధి హక్కులను కాపాడాలని ఆమె స్పష్టం చేశారు.



2

# ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశం

- ఓట్లు తొలగిస్తారన్న అపోహ సరికాదు
- చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు
- ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

తెలంగాణలో జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుందని.. జూలై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే పక్రియ కొనసాగుతుందని చెప్పారు.

# ఒడిశాలో 47వేల కోట్లతో అభివృద్ధి

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోదీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోదీ



4



## గ్లోబల్ ఖాకీగా 'భారత్'

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు కీలక బాధ్యతలు

ఎఫ్ఏటీఎఫ్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ ఐపీఎస్ 3

# ప్రియుడి మోజులో పసివాడి హత్య!

- అడ్డుగా ఉన్నాడని కన్నకొడుకును కడతేర్చిన తల్లి
- ప్రియుడితో కలిసి దారుణం



వివరాలు 2లో..



## భగీరథ్‌కు బెయిల్

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడికి ఊరట

వారం రోజుల పాటు షరతులతో కూడిన బెయిల్

ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో కోర్టు అనుమతి

2

## పాముతో ఆట.. ప్రాణం బలి

- స్నేహితులను భయపెట్టబోయి..
- కట్లపాముతో యువకుడి విన్యాసాలు
- బొటనవేలిపై కాటు.. కన్నుమూత

2



# నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు





4

- మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్
- ఖంగుతిన ఎటీఏకు సమాచారం ఇచ్చిన విద్యార్థి
- పొరపాటు సవరించి, కొత్త కేంద్రం అలాట్

# పాముతో ఆట.. ప్రాణం బలి!

**స్నేహితులను భయపెట్టబోయి.. కట్లపాముతో యువకుడి విన్యాసాలు**

**బొటనవేలిపై కాటు..కన్నుమూత**



**హైదరాబాద్:** స్నేహితులను భయపెట్టాలని ఓ యువకుడు చేసిన పిచ్చి పని అతని ప్రాణాలనే బలితీసుకుంది. కట్లపాము పిల్లతో చెలగాటమాడుతూ పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయాడు. మొయినాబాద్ లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. రాజేంద్రనగర్ కు చెందిన వ్యాపారవేత్త నవాబ్ జయద్ ఖుమెద్ మొహియుద్దీన్ (30) తన స్నేహితులతో కలిసి ఇటీవల మొయినాబాద్ లోని ఓ ఫామ్ హౌస్ కు వెళ్లాడు. సరదాగా గడుపుతున్న సమయంలో అక్కడికి ఓ కట్లపాము పిల్ల వచ్చింది. దాన్ని చూడగానే నవాబ్ చేతుల్లోకి తీసుకున్నాడు. పాముతో స్నేహితులను భయపెట్టే ప్రయత్నం చేశాడు. ఇంతలో ఆ పాము అతని కుడిచేతి బొటనవేలిపై కాటు వేసింది. చిన్న పామే కదా అని నవాబ్ నిర్లక్ష్యం చేశాడు. తనకు ఎలాంటి ఇబ్బందీ లేదని, ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదని స్నేహితుల ముందు నవ్వుతూ చెప్పాడు. కట్లపాము విషం ఎంత ప్రమాదకరమో అతను గ్రహించలేకపోయాడు. కొద్దిసేపటికే విషం శరీరమంతా వ్యాపించి శ్వాస తీసుకోవడం కష్టంగా మారింది. ఆరోగ్యం వేగంగా క్షీణించడంతో ఆందోళన చెందిన స్నేహితులు హుటాహుటిన ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ లాభం లేకపోయింది. అప్పటికే విషం పూర్తిగా వ్యాపించడంతో నవాబ్ కన్నుమూశాడు.

# ప్రియుడి మోజులో పసివాడి హత్య!

**అడ్డుగా ఉన్నాడని కన్నకొడుకును కడతేర్చిన తల్లి**

**ప్రియుడితో కలిసి దారుణం.. ఫిట్స్ వచ్చి చనిపోయాడని కట్టుకథ**

**20 రోజుల తర్వాత వెలుగులోకి బండారం**

**సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రియుడితో ఏకాంతంగా గడిపేందుకు అడ్డువస్తున్నాడని రెండేళ్ల కన్న కొడుకునే ఓ తల్లి అత్యంత కిరాతకంగా హత్య చేసింది. బాబుకు ఫిట్స్ వచ్చి చనిపోయాడని అందరినీ నమ్మించినా.. భర్తకు అనుమానం రావడంతో 20 రోజుల తర్వాత అసలు నిజం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన స్వామి క్యాబ్ డ్రైవర్. తన భార్య జ్యోతి, రెండేళ్ల కుమారుడు హరికృష్ణతో కలిసి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో జ్యోతి నవీన్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంది. భర్త ఇంట్లో లేని సమయంలో ప్రియుడిని పిలిపించుకునేది. ఇలా వాళ్లిద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో బాబు తరచూ ఏడుస్తుండటంతో నవీన్ చిరాకు పడ్డాడు. ఈ క్రమంలోనే నీ కొడుకు నాకు నచ్చట్లేదు.. వాడిని చంపేద్దామని జ్యోతితో చెప్పాడు. ప్రియుడి మోజులో పడ్డ జ్యోతి ఆ దారుణానికి అంగీకరించింది. దీంతో ఇద్దరూ కలిసి ఏడుస్తున్న బాబును కఠినంగా నేలకేసి కొట్టి చంపేశారు. బాబు చనిపోయిన తర్వాత నాటకమాడిన జ్యోతి.. భర్త స్వామి ఇంటికి రాగానే అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి బాబు చనిపోయాడని ఏడ్చింది. భార్య మాటలు నమ్మిన స్వామి.. నిజమేనని భావించి అదే రోజు రాత్రి మృతదేహాన్ని స్వగ్రామమైన తీగుల్ తీసుకెళ్లి ఖననం చేశాడు. కొద్దిరోజుల తర్వాత భార్య ప్రవర్తనలో తేడా రావడంతో స్వామికి అనుమానం మొదలైంది. పైగా ఇంట్లో రక్తపు మరకలు కనబడటంతో ఆ అనుమానం కాస్తా బలపడింది. దీంతో తన కొడుకు మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించగా.. జ్యోతి నేరం అంగీకరించింది. ఈ ఘటనలో జ్యోతిని పోలీసులు అరెస్టు చేయగా.. నవీన్ పరారీలో ఉన్నాడు.

# భగీరథ్‌కు బెయిల్!

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడికి ఊరట**

**వారం రోజుల పాటు షరతులతో కూడిన బెయిల్**

**ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో కోర్టు అనుమతి**

**హైదరాబాద్:** కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న ఆయనకు మల్కాజిగిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో ఈ నెల 26 వరకు న్యాయస్థానం మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో భగీరథ్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజుల పాటు అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న పోలీసులకు లొంగిపోయాడు. నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఆ తర్వాత చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకుముందు సిట్ అధికారులు భగీరథ్‌ను రెండు గంటలకు పైగా విచారించారు. నెల రోజులకు పైగా జైలులో ఉన్న భగీరథ్.. తాజా బెయిల్‌తో బయటకు రానున్నాడు.



# కలిసి వెళ్దాం.. మెట్రో నిధులు తెద్దాం!

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ బహిరంగ లేఖ
- మెట్రో రెండో దశపై రైల్వే మంత్రిని కలుద్దాం
- 22, 23 తేదీల్లో నేను ఢిల్లీలోనే ఉంటా..
- ఒప్పంద పత్రాలతో వస్తా.. ఇద్దరం కలిసి వెళ్దాం

**హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ, ఎల్ అండ్ టీ ఆర్థికపరమైన అంశాల పరిష్కారం కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఇద్దరం కలిసి కలుద్దామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ఈ నెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలోనే ఉంటానని, ఆ సమయంలో రైల్వే మంత్రితో భేటీ ఇప్పించాలని కోరుతూ కిషన్ రెడ్డికి శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రాజెక్టుపై కేంద్రం సహకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా పెండింగ్ అంశాల పరిష్కారానికి చొరవ చూపాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. మెట్రో రెండో దశ, ఎల్ అండ్ టీ వ్యవహారాలపై చర్చించేందుకు వీలుగా కేంద్ర రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ఒప్పంద పత్రాలతో వస్తా..**

ఈ నెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలోనే ఉంటానని, ఆ సమయంలో అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించేలా చూడాలని సీఎం రేవంత్ కోరారు. ఇద్దరం కలిసి వెళ్లి రైల్వే మంత్రిని కలుద్దామని ఆయన ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పంద పత్రాలతో సమావేశానికి తాను హాజరవుతానని స్పష్టం చేశారు. తెలంగాణకు హైదరాబాద్ మెట్రో అత్యంత కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టు అని, దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు సత్వరమే పరిష్కారం దొరకాల్సిన అవసరం ఉందని లేఖలో వివరించారు.

**మీ పిలుపు కోసం ఎదురుచూస్తా..**

హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై ఇదే నెల 16వ తేదీన కూడా కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ లేఖ రాశారు. ఈ సమస్య పరిష్కారానికి ఏ సమావేశానికైనా తాను సిద్ధమేనని అందులో స్పష్టం చేశారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలని కోరారు. ఆ సమావేశానికి సంబంధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురుచూస్తానని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం అవసరమైతే కిషన్ రెడ్డితో వ్యక్తిగత భేటీకి కూడా తాను సిద్ధమేనని రేవంత్ ఆ లేఖలో పేర్కొన్నారు.



# తెలంగాణ స్వాప్నికుడు!

**ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళి**

**సేవలను స్మరించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్:** తెలంగాణ జాతిపిత, స్వరాష్ట్ర స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఆ మహనీయుని త్యాగాన్ని, సేవలను ఆయన స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా జయశంకర్ సార్ తన జీవితాన్ని గడిపారని ముఖ్యమంత్రి కొనియాడారు. తెలంగాణ సమాజం, ప్రజా ప్రభుత్వం ఆ మహనీయుని త్యాగాన్ని సదా గుర్తుంచుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. జయశంకర్ సార్ ఉద్యమ స్ఫూర్తిని తాము తప్పకుండా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆయన ఆశయ సాధన కోసం తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

**ఉద్యమ చైతన్యం..**

హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ సార్ తీవ్రంగా వ్యతిరేకించారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పొరుగు రాష్ట్రంతో విలీనం వల్ల తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చారని చెప్పారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఏకంగా 6 దశాబ్దాల పాటు సజీవంగా ఉంచిన ఘనత జయశంకర్ సార్‌కే దక్కుతుందని ముఖ్యమంత్రి కొనియాడారు.

# ఆత్మవిశ్వాసంతో రాయండి!

**నీట్ విద్యార్థులకు సీఎం శుభాకాంక్షలు**

**హైదరాబాద్ :** ఆదివారం జరగనున్న 'నీట్' పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి అత్యంత కీలకమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతో కాలంగా విశేష కృషి చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆయన సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

**ముందుగానే చేరుకోండి..**

దేశవ్యాప్తంగా ఆదివారం పునర్నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్రం నుంచి దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. విద్యార్థుల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆఖరి నిమిషం వరకు వేచి చూడకుండా విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

# ఆ చట్టాన్ని సవరించాల్సిందే!

**వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి**

**అరవై రోజుల ఉపాధి విరామంతో పేదలకు తీవ్ర నష్టం**

**కేంద్రానికి మూడు లేఖలు రాసిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్:** గ్రామ పంచాయతీలను బలహీనపరిచేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వెంటనే సవరించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ఈ నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ, అందులోని అభ్యంతరాలను వివరిస్తూ కేంద్రానికి మూడు వేర్వేరు లేఖలు రాశామని ఆమె వెల్లడించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల జీవనోపాధి హక్కులను కాపాడాలని ఆమె స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడారు. వీబీజీ రామ్‌జీ నిధుల కేటాయింపు విధానం పేదలు, దళితులు, గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే జీవనోపాధి పనులను నిరాటంకంగా కొనసాగించాలని సూచించారు. వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, పోషకాహార పెరటి తోటలు, వెదురు తోటల పెంపకానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అరవై రోజుల తప్పనిసరి ఉపాధి విరామం వల్ల పేదల ఆదాయం తీవ్రంగా దెబ్బతింటుందని, ముఖ్యంగా ఆదివాసీ, నీటి ఎద్దడి ప్రాంతాలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ అనుబంధ పనులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధులు..**

రాష్ట్రాన్ని మొత్తం ఒకే యూనిట్‌గా చూడకుండా గ్రామస్థాయి ఉపాధి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సూచించారు. ఆదిలాబాద్, ములుగు, కుమురంభీం ఆసిఫాబాద్ లాంటి వెనుకబడ్డ ప్రాంతాల అవసరాలను విస్మరించొద్దని కోరారు. గ్రామ పంచాయతీల్లో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలన్నారు. నిధుల పంపిణీ విషయంలో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని కూడా వీబీజీ రామ్‌జీ చట్టం పరిధిలో అనుమతించి, గృహ నిర్మాణ లబ్ధిదారులకు గతంలోలాగే తొంభై రోజుల ఉపాధి కల్పించాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యక్తిగత భూ అభివృద్ధి పనులను తొలగిస్తే సన్నకారు రైతులకు తీరని నష్టం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.




# ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశం

**ఓట్లు తొలగిస్తారన్న అపోహ సరికాదు**

**చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు**

**ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ**

**హైదరాబాద్, జూన్ 20:** తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్ అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా ప్రక్షాళన జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే సర్ ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.



# పరేడ్ గ్రౌండ్‌లో 'యోగా'డే

- ఒకే వేదికపై గవర్నర్, కేంద్ర మంత్రి, వెంకయ్యనాయుడు!
- సికింద్రాబాద్ మైదానంలో జనసముద్రం
- తరలివచ్చిన విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు
- సాధన చేసిన ఎంపీలు ఈటల, లక్ష్మణ్, రామచందర్‌రావు
- సినీ గ్లామర్ జోడించిన నవీన్ పోలిశెట్టి, డింపుల్ హయాతి



**హైదరాబాద్, జూన్ 20:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని చారిత్రాత్మక పరేడ్ మైదానం సరికొత్త ఆధ్యాత్మిక, ఆరోగ్య చైతన్యానికి వేదికగా మారింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ నిర్వహించిన మెగా యోగా ఉత్సవంలో వేలాది మంది నగర ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఒకేతాటిపైకి వచ్చి యోగాసనాలు వేశారు. ఈ వేడుకకు రాష్ట్రప్రముఖులు, కేంద్ర పాలకులతో పాటు టాలీవుడ్ సినీ గ్లామర్ కూడా తోడవడంతో పరేడ్ గ్రౌండ్స్ సరికొత్త శోభను సంతరించుకుంది.

### ఒకే వేదికపై దిగ్గజాలు.. యోగా సాధన!

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొని స్వయంగా యోగా సాధన చేశారు. వారితో పాటు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె. లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత ఎన్. రామచందర్‌రావు తదితర రాజకీయ దిగ్గజాలు సామాన్య ప్రజలతో కలిసి ఆసనాలు వేశారు. వీరితో పాటు యువతను ఉర్రూతలూగించే టాలీవుడ్ స్టార్ హీరో నవీన్ పోలిశెట్టి, ప్రముఖ నటి డింపుల్ హయాతి కూడా ఈ యోగా వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



### ఆరోగ్య భారత్‌కు యోగా కవచం: కిషన్‌రెడ్డి

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏటా భారత్ నేతృత్వంలో ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని ఒక పండుగలా నిర్వహించడం మన సాంస్కృతిక విజయమన్నారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభించడంతో పాటు ఆధునిక కాలంలో మనుషులను పీడిస్తున్న సకల శారీరక రుగ్మతల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉదయాన్నే పరేడ్ గ్రౌండ్స్‌లో వందలాది మంది క్రమశిక్షణతో, ఉత్సాహంగా యోగాసనాలు వేసిన దృశ్యాలు నగరవాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.





# కవిత బొగ్గుబాయి బాటలో ఉద్రిక్తత

### భూపాల్‌పల్లిలో అడ్డుకున్న పోలీసులు

**జయశంకర్ భూపాలపల్లి, జూన్ 20:** టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చేపట్టిన బొగ్గుబాయి బాట ఉద్రిక్తతలకు దారితీసింది. సింగరేణి కేటీకే-5 ఇంక్లైన్ గని వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా 'తెలంగాణ రక్షణ సేన' అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేటీకే-5 ఇంక్లైన్ గనికి చేరుకున్నారు. అయితే గని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన కవితను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, టీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కవితకు మద్దతుగా వచ్చిన నాయకులు మెయిన్ గేట్ ఎక్కేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్తత మరింత పెరిగింది. నిరసన మధ్య గేట్‌ను తొలగించడంతో కల్వకుంట్ల కవిత అనుచరులతో కలిసి గని ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఈ ఘటనతో గని పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# చిట్టీల మాస్టారుపై వేటు!

### నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం..ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్




**హనుమకొండ:** ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం చేస్తున్న ఓ ఉపాధ్యాయుడిపై అధికారులు వేటు వేశారు. అతడిపై వచ్చిన ఆరోపణలు ఉన్నతాధికారుల విచారణలో రుజువు కావడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగానికి విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, పలు మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల ఎల్లయ్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ ఆరోపణలపై పూర్తి విచారణ చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో ఎల్లయ్య చిట్టీల వ్యాపారం చేస్తున్నట్లు నేరం రుజువు కావడంతో తక్షణమే ఆయనను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.


# మూసీ నిర్వాసితులకు ముందు న్యాయం చేయండి

### ప్రభుత్వానికి బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్

**హైదరాబాద్, జూన్ 20:** మూసీ పునరుద్ధరణకు భాజపా వ్యతిరేకం కాదని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బాధితులకు న్యాయం చేశాక, ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఫణికుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగరేణి స్కామ్ బయటపడుతుందనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వర్గపోరు కారణంగానే ప్రాంతీయ పార్టీలు చీలిపోతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫాంలు ఇచ్చారు. కనీస మౌలిక సదుపాయాలు లేని బడులు లెక్కలేనన్ని ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందో రేవంత్‌రెడ్డి చూడాలి. ప్రైవేటు పాఠశాలలు ఎందుకు పెరుగుతున్నాయి? కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న ఆదరణ ప్రభుత్వ బడులకు ఎందుకు లేదు? బ్జడెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి. ఉస్మానియా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ.. వర్సిటీల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. టీచర్లు, ప్రొఫెసర్లు హక్కుల గురించి మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు.

# వైద్యం.. అభయం!

- పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం
- సైన్స్, టెక్నాలజీ సామాన్యుడికి చేరాలి
- పాఠశాలలకు 'విజయ' డెయిరీ పాలు
- పాడి రైతులకు ఆగని చెల్లింపులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, జూన్ 20:** ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యమని, సామాన్యుడికి అందుబాటులో ఉండేలా వ్యవస్థలు మారాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో జరిగిన ఇండియా హెల్త్ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరోవైపు, రాష్ట్రంలో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు 'విజయా డెయిరీ'ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన పాల్గొని, 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఇండియా హెల్త్ సమ్మిట్‌లో వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదని, ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆర్థికంగా కుప్పకూలిపోతారని, జీవితాంతం దాచుకున్న పొదుపు క్షణాల్లో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు భయం లేకుండా ఆసుపత్రికి వెళ్లేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ హయాంలో తీసుకువచ్చిన వైద్య, ఆరోగ్య రంగ పథకాలను ఆయన గుర్తుచేశారు. దివంగత వై.ఎస్. రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పేదవాడికి భరోసా ఇచ్చిందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందని చెప్పారు.

### పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ..

వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, సరికొత్త పరికరాలు అట్టడుగు వర్గాలకు కూడా అందాలని భట్టి స్పష్టం చేశారు. నాయకత్వం అనేది సర్టిఫికెట్ కాదని, బాధ్యత అని వ్యాఖ్యానించారు. వ్యాధి వచ్చిన తర్వాత అందించే 'ఇల్‌నెస్ కేర్' కాకుండా, ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్'గా వైద్య విధానం మారాలన్నారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని ప్రకటించారు. జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను అందించడానికి తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు.

### పాడి రైతుకు భరోసా.. విద్యార్థులకు 'విజయ' పాలు

రాష్ట్రంలో పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సచివాలయంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయా డెయిరీ' పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో పాల ఉత్పత్తికి సంబంధించి కచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల సంఖ్యను గుర్తించి, వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి నివేదిక ఇవ్వాలని సూచించారు. రైతుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలని, బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. పాఠశాలలకు సరఫరా చేసే పాల బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయడం ద్వారా రైతులకు బకాయిలు ఉండవని స్పష్టం చేశారు. పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుందని, డెయిరీకి నమ్మకంతో పాలు పోస్తారని ఆయన అన్నారు. పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు ఆధునిక పద్ధతులు అనుసరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు.

# హైడ్రాపై బురద చల్లొద్దు!

### 600 ఆపరేషన్లు పూర్తి చేశాం..
### రూ.1.10 లక్షల కోట్ల ఆస్తుల రక్షణ
### రాజకీయాలకు అతీతంగా మా చర్యలు..
### కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్:** ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న 'హైడ్రా'పై ఉద్దేశపూర్వకంగా కొందరు బురద చల్లుతున్నారని ఆ సంస్థ కమిషనర్ రంగనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉంటుందని, కానీ దుష్ప్రచారంతో అడ్డుకోవాలని చూడటం సరికాదని హితవు పలికారు. ఇప్పటివరకు 600 ఆపరేషన్లు పూర్తి చేసి ఏకంగా రూ.1.10 లక్షల కోట్ల (1,10,000 కోట్లు) విలువైన ఆస్తులను కాపాడామని వెల్లడించారు. తాము ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించబోమని, చట్టం అందరికీ ఒకటేనని తేల్చిచెప్పారు. పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించే ముందు, వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చాకే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దోపిడీకి గురికాకుండా ఉండేందుకే ప్రజలు ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడారని రంగనాథ్ గుర్తుచేశారు. సామాజిక మాధ్యమాల్లో తమపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో రాష్ట్ర సర్కారు హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. భాగ్యనగరంలో ఫాతిమా కళాశాల లాంటివి ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. హైడ్రా దృష్టిలో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల నేతలైనా అందరూ సమానమేనని తేల్చిచెప్పారు.

### రాత్రికి రాత్రే కూల్చం..

హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని, అలాగని రాత్రికి రాత్రే భవనాలను కూల్చేస్తుందనేది పూర్తిగా తప్పుడు ప్రచారమని రంగనాథ్ కొట్టిపారేశారు. గుడిసెలు ఉన్న చోట గతంలో కంటే ఇప్పుడు ఆక్రమణలు వంద రెట్లు పెరిగాయని, దీని వెనుక కొన్ని శక్తులు ఉన్నాయని ఆరోపించారు. గుడిసెలు ఉన్నవి నిజమైన బాధితులవేనా కాదా అని క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాకే తదుపరి చర్యలు ఉంటాయన్నారు. హైడ్రా రంగంలోకి దిగకపోతే మిగిలిన ప్రభుత్వ ఆస్తులు కూడా కనుమరుగయ్యేవని ఆందోళన వ్యక్తం చేశారు.

### తప్పు జరిగితే క్షమాపణలు..

ఈ నెల 9వ తేదీన కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిందని రంగనాథ్ గుర్తుచేశారు. లక్ష మందికి మేలు జరగాలంటే కొందరికి ఇబ్బందులు తప్పవని వివరించారు. తమ వైపు నుంచి తప్పు జరిగితే కచ్చితంగా క్షమాపణలు అడుగుతామని స్పష్టం చేశారు. హైడ్రా ఎన్నో విషయాలు నేర్చుకుంటూ ముందుకు సాగుతోందని, తప్పులను సరిదిద్దుకుంటూ లక్ష్యం వైపు అడుగులేస్తోందని చెప్పారు. వివాదాలకు అడ్డాగా మారకుండా, రాజకీయాలకు అతీతంగా ప్రజల నమ్మకం, విశ్వాసం చూరగొనేలా హైడ్రా పనిచేస్తుందని కమిషనర్ రంగనాథ్ ఉద్ఘాటించారు.





# సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ యోగా!

మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్లుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆద్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం. యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్ఛేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరిం చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం. ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయం లోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుడ్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరఖ్స్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్దాసనము, అర్ధ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది. ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున – స్థిరసుఖ మాసనమ్– అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో – సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్చ – ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము – ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ – ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.–ధవుతి, నేతి, వస్తి, నౌలి, త్రటకం, తథా కఫాల భాతి ఏతాని షట్ కర్మాణి – అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయ డానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం సుఖమయంగా సాగగలదు.

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన



**భువనేశ్వర్, జూన్ 20:** ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్బ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపడ రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# గ్లోబల్ ఖాకీగా 'భారత్'

- ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు కీలక బాధ్యతలు
- ఎఫ్ఏటీఎఫ్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ ఐఏఎస్



**న్యూఢిల్లీ, జూన్ 20:** ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తాజాగా కీలక బాధ్యతలు లభించాయి. టెర్రరిస్టుల ఆర్థికమూలాలు, అక్రమ నగదు రవాణా నెట్వర్క్‌లను దెబ్బతీసేందుకు ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఉగ్రవాదులకు నిధులు అందకుండా అంతర్జాతీయంగా చేపడుతున్న చర్యల్లో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ఇది ఒక భారీ విజయమని వ్యాఖ్యానించారు. ఎఫ్ఏటీఎఫ్‌లో ఒక భారత అధికారికి ఇంతటి కీలక బాధ్యతలు దక్కడం ఇదే తొలిసారి. ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ప్రస్తుతం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఉన్నారు. అంతకుముందే, కేంద్ర ప్రభుత్వంతో పాటు పంజాబ్, మధ్యప్రదేశ్‌లో వివిధ స్థాయిల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ కేడర్‌లో చీఫ్ సెక్రటరీ గ్రేడ్ అధికారిగా 2025లో పదోన్నతి సాధించారు. గతంలో ఆయన రెవెన్యూ శాఖ అడిషనల్ సెక్రటరీగా ఉన్నారు. ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ డైరెక్టర్‌గా కూడా సేవలందించారు. పరిపాలన, ఆర్థిక అంశాల నిర్వహణలో విశేష గుర్తింపు పొందారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీకామ్, ఎల్ఎల్‌బీ చేసిన ఆయన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీస్ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా నుంచి సీఎస్(ఇంటర్) కూడా చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలకు సంబంధించి ప్రత్యేక కోర్సు కూడా చేశారు.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

## హనుమాన్ ఆలయ పైకప్పు కూలి నలుగురు మృతి

**ముంబై, జూన్ 20:** మహారాష్ట్రలోని పర్భానీ జిల్లా యశ్వాడి గ్రామంలో శనివారం ఘోర ప్రమాదం సంభవించింది. ఇక్కడి ప్రసిద్ధ హనుమాన్ ఆలయంలో నిర్మాణంలో ఉన్న మండపం పైకప్పు భాగం ఒక్కసారిగా కూలింది. ఈ ప్రమాదంలో నలుగురు భక్తులు చనిపోగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నారు. నుమాన్ దేవాలయాల్లో శనివారం భక్తుల రద్దీ సాధారణంగానే ఎక్కువగా ఉంటుంది. యశ్వాడి గ్రామంలోని ఈ ఆలయానికి కూడా ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులంతా దర్శనం కోసం వేచి ఉన్న సమయంలో, కొన్ని రోజులుగా నిర్మాణంలో ఉన్న మండపం పైకప్పు, దానికి ఆసరాగా ఉన్న ఒక పిల్లర్, గోవా కర్రలు ఒక్కసారిగా కుప్పకూలి కింద ఉన్న భక్తులపై పడ్డాయి. ఈ దుర్ఘటనలో దాదాపు 20 మంది భక్తులకు తీవ్ర గాయాలయినట్టు సమాచారం. వెంటనే స్పందించిన స్థానికులు, ఆలయ సిబ్బంది గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ సభామండపం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణంలో ఉన్న మండపం కూలిపోవడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు.



# పీఎం కిసాన్ డబ్బులు విడుదల : మోదీ

**కోల్‌కతా, జూన్ 20:** పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం–కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్దిదారుల జాబితా కనిపిస్తుంది.

# నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు

**మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్**

**ఖంగుతిన ఎటిఎకు సమాచారం ఇచ్చిన విద్యార్థి**

**పొరపాటును సవరించి, కొత్త కేంద్రం అలాట్‌కు హామీ**



**న్యూఢిల్లీ, జూన్ 20:** నీట్ రీ–ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డులో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ.. సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్‌లో ఎన్‌టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పుర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్‌టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సమస్యను పరిష్కరిస్తున్నామని.. కొన్ని గంటల్లోనే ఆ విద్యార్థికి పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని స్పష్టంచేసింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో రద్దయిన నీట్ ఎంట్రన్స్ పరీక్షను నేడు మరోసారి నిర్వహించనున్న విషయం తెలిసిందే. రీ–నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్టు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయం ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని సంస్థ తెలిపినట్టు విద్యార్థి తండ్రి తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని, సవరించిన అడ్మిట్ కార్డును జారీ చేస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎన్‌టీఏ నుంచి ఈమెయిల్ వచ్చిందని వెల్లడించారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు





- జిల్లా కలెక్టర్ కె. హరిత హెచ్చరిక
- గైర్హాజరైన వైద్యులకు షోకజ్ నోటీస్ జారీ

**ఉద్యమ కెరటం, కెరమెరి:** ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను, వైద్యులను ఆదేశించారు. శనివారం కెరమెరి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులు, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించిన కలెక్టర్, వైద్యులు సిబ్బంది హాజరు పట్టికను, రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా విధులకు గైర్హాజరైన వైద్యులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధుల పట్ల ఖచ్చితమైన సమయపాలన పాటించాలని స్పష్టం చేస్తూ, గైర్హాజరైన సదరు వైద్యులకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యం అందించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోగుల రికార్డులు, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, ప్రజలకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరిగేలా ఆసుపత్రి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలని, వార్డులను నిరంతరం శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. రోగులకు మెరుగైన వాతావరణంలో వైద్య సేవలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో ఎలాంటి అలసత్వానికి తావులేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెరమెరి, వాంకిడి మండలాల తహసిల్దార్లు, బూత్ స్థాయి అధికారులు బూత్ స్థాయి ఏజెంట్లు, సూపర్వైజర్లు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, కెరమేరి:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా, ప్రశాంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. కెరమెరి మండలం కేస్లాగూడ రైతు వేదికలో బూత్ స్థాయి అధికారులు , ఏజెంట్లు, సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ బీఎల్ఓలు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి వాలంటీర్ల సహకారంతో మ్యాపింగ్ అయిన, కాని వారి వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి నుండి ఓటరు నమోదు కోసం 'ఫారం 6' ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని, ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి బీఎల్ఓ యాప్ లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఆమె బూత్ స్థాయి అధికారులకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెరమెరి, వాంకిడి మండలాల తహసిల్దార్లు, బూత్ స్థాయి అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# భూముల సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :**
వచ్చే నెలలో చేపట్టనున్న భూముల సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మండల సర్వేయర్లు, లైసెన్సుడు సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెలలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని 70 గ్రామాలలో సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూ సమస్యలు, భూ వివాదాలు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, ఈ సర్వేను ఆధునిక, సాంకేతిక పద్ధతులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డి జి పి ఎస్, రూవర్స్ జి ఐ ఎస్, క్యూ జి ఐ ఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం జరుగుతుందని, సర్వేయర్లు, లైసెన్సుడు సర్వేయర్లు సాంకేతిక వినియోగంపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. సర్వే పూర్తి అయిన అనంతరం భూదార్ కార్డులు ప్రభుత్వం జారీ చేస్తుందని, రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.పి. సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి వినయ్, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు, మండల సర్వేయర్లు, లైసెన్సుడు సర్వేయర్లు పాల్గొన్నారు.

# ఓటరు సవరణపై విస్తృత అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కె. హరిత
- ఈ నెల 25 నుండి జూలై 24 వరకు ప్రత్యేక డ్రైవ్..



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్: జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు నిర్వహించనున్న 'ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ' కార్యక్రమంపై ప్రతి ఒక్కరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. శనివారం ఉదయం కలెక్టరేట్ భవన సముదాయం నుండి వివేకానంద, అంబేద్కర్ చౌక్ మీదుగా నిర్వహించిన అవగాహన "2K రన్" ను అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ గారితో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మొత్తం 678 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగాలని అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతో పాటు మార్పులు చేర్పులను సక్రమంగా చేపట్టాలన్నారు. బిఎల్ఓ యాప్ ద్వారా ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు భాగస్వాములు కావాలని, మీడియా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ అవగాహన రన్‌లో జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి




**ఉద్యమ కెరటం, తాండూర్:** ఉపాధిహామీ కూలీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజారాం డిమాండ్ చేశారు. శనివారం తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులతో కలిసి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరును మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నామని, పాత పథకాన్నే కొనసాగించాలని కోరారు. కొత్త విధానాలతో ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో ఆన్లైన్ హాజరు, ఫోటో విధానం కారణంగా కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అడవి ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, రెండో ఫోటో విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు ఎండా కాలం బోనస్, రాను-పోను చార్జీలు, పనిముట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. పని అడిగిన వారంలోపు పని ఇవ్వాలని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి చెల్లించాలని అన్నారు. అలాగే పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేసి, చిన్నారుల సంరక్షణ కోసం ఆయాలను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గం భాగ్య, దాగం సుమ, డి.సప్న, ఎం.రాజేశం, మంగ, జంశెట్టి రవీందర్, దుర్గం సంగీత, లింగాల లక్షి , రాజమ్మ, ఇప్ప రేవతి, సురుపత్తుల నందు, మోత్కుల రమేష్ తదితర ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## పవర్‌గూడలో బాల గ్రామసభ

ఐదు కీలక తీర్మానాల ఆమోదం!




**ఉద్యమ కెరటం, జైనూర్ (సబిర్ పాషా):** పవర్‌గూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో 'బాల గ్రామసభ'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోడాసం రాజేందర్, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలు తమ సమస్యలను, గ్రామాభివృద్ధికి కావాల్సిన అవసరాలను సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బాలల సమగ్ర అభివృద్ధి, భద్రత, విద్యా వసతుల మెరుగుదల, పౌష్టికాహారం పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఐదు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, పిల్లల హక్కుల పరిరక్షణకు, వారి ఉజ్వల భవిష్యత్తుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కిశోర్ కుమార్, కారోబారి జ్ఞానేశ్వర్, గ్రామ పటేల్ రాంజీ అశ్వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్ పుస్తకాల గోదాం సీజ్






**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లిలో శ్రీ చైతన్య స్కూల్ పేరుతో పాఠ్య పుస్తకాలు, బెల్టులు తదితర విద్యా సామాగ్రిని విక్రయిస్తున్న గోదాంపై విద్యా శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు ఎంఈఓ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు చేపట్టారు. సత్తుపల్లి పట్టణంలోని ఓ నివాస గృహంలో గోదాం ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పాఠ్యపుస్తకాలు, బెల్టులు, ఇతర విద్యా సామాగ్రిని నిల్వ ఉంచి విక్రయాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల సందర్భంగా భారీ సంఖ్యలో పుస్తకాలు, బెల్టులు లభ్యమవడంతో వాటిని స్వాధీనం చేసుకుని గోదాంను సీజ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం సామాగ్రి విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంఈఓ రాజేశ్వరరావు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. విద్యా సంస్థల పేరుతో జరుగుతున్న అక్రమ విక్రయాలపై విద్యా శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణకు సన్మానం



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కోమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్‌గా నియమితులైన అర్షద్ హుస్సేన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మైనార్టీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని అర్షద్ హుస్సేన్ పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అర్షద్ హుస్సేన్‌కు అభినందనలు తెలియజేసి, పార్టీ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మైనార్టీ విభాగాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలి

శ్రీరామ్ రాజేశ్వర్.

**ఉద్యమ కెరటం, టేక్మాల్**
టేక్మాల్ మండలంలోని ఇండియన్ గ్యాస్ వినియోగదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఎస్ ఆర్ ఆర్ ఇండియన్ గ్యాస్ ప్రోప్రైటర్ శ్రీరామ్ రాజేశ్వర్ సూచించారు. ఈ నెల 30వ తేదీ లోపు గడువు ముగుస్తున్న నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వినియోగదారులు ఈ నెల 30వ తేదీలోపు తమ ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. వినియోగదారులు నేరుగా టేక్మాల్‌లోని ఎస్ ఆర్ ఆర్ ఇండియన్ గ్యాస్ కార్యాలయానికి వచ్చి ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చు. ఒకవేళ వినియోగదారులు ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లయితే, తమ మొబైల్ ఫోన్‌లో 'ఇండియన్ ఆయిల్ వన్' అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, దాని ద్వారా ఆన్‌లైన్‌లోనే ఈకేవైసీని పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. గడువులోగా ఈకేవైసీ చేసుకోని వారి గ్యాస్ బుకింగ్‌లు రాబోయే రోజుల్లో నిలిపివేయబడతాయని (బ్లాక్ అవుతాయని) ఆయన స్పష్టం చేశారు. అక్రమ గ్యాస్ కనెక్షన్లకు అడ్డుకట్ట వేయడంతో పాటు, ప్రభుత్వ రాయితీ దుర్వినియోగం కాకుండా పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియను తప్పనిసరి చేసిందని ఆయన వివరించారు.నిబంధనల ప్రకారం గ్యాస్ సేవలు నిరాటంకంగా కొనసాగేలా, లబ్ధిదారులు త్వరగా స్పందించి ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

# సాగు పనులు మొదలైనా అందని రుణాలు...!

- **మంచిర్యాల ఎస్బీఐ రీజినల్ ఆఫీస్ వద్ద పోడు రైతుల ఆవేదన**

**ఉద్యమ కెరటం, జైనూర్ :** అటవీ హక్కు పత్రాలు (పోడు పట్టాలు) కలిగి ఉన్న ఆదివాసీ రైతులకు పంట రుణాల మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరుతూ జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాలకు చెందిన 15 మంది రైతులు శనివారం మంచిర్యాలలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రీజినల్ కార్యాలయ అధికారులను కలిశారు. ఈ మేరకు వారు అధికారులకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. జైనూర్ ఎస్బీఐ శాఖ పరిధిలో పోడు రైతులకు రుణాలు ఇవ్వడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని వారు రీజినల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే వానాకాలం సాగు పనులు ప్రారంభమైనప్పటికీ, బ్యాంకుల నుంచి రుణాలు అందకపోవడంతో పెట్టుబడి కోసం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల వినతిని స్వీకరించిన రీజినల్ బ్యాంక్ ఆర్ఎమ్వో సానుకూలంగా స్పందించారు. పంట రుణాల పంపిణీ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని జైనూర్ ఎస్బీఐ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రుణాల మంజూరులో జాప్యాన్ని నివారించేందుకు త్వరలోనే జైనూర్ శాఖలో అదనంగా మరో ఫీల్డ్ ఆఫీసర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఫీల్డ్ ఆఫీసర్



నియామకంతో రైతులకు వేగంగా రుణాలు అందే అవకాశం ఉంటుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ రైతులు పెందోర్ కేశవరావు, సోయం దినకర్ షా, మధురాజ్ మడావి, కొడప సుదర్శన్, మెస్రం జ్ఞానేశ్వర్, పెందూర్ అశోక్, ఆత్రం భగవంతరావు తదితరులు పాల్గొన్నారు.

# అధికార దాహంతోనే ప్రతిపక్షాల అసత్యపు ప్రచారం

**ఉద్యమ కెరటం, బోథ్:** గత పదేళ్ల కాలంలో తెలంగాణను, ముఖ్యంగా బోథ్ నియోజకవర్గాన్ని వెనుకబాటుతనానికి గురిచేసిన శక్తులు నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాయని బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి మండిపడ్డారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజల సంక్షేమం, నిరుద్యోగ యువత భవిష్యత్తే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంటే, ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయని ఉద్యోగాల భర్తీని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే చేపట్టి, వేలాది మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందించి రికార్డు సృష్టించిందన్నారు. వేలాది ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. లీకులు, మోసాలకు తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడం ప్రభుత్వ నిబద్ధతకు





నిదర్శనమని అన్నారు. ఆరు గ్యారెంటీల అమలుతో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకొచ్చామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి ఆర్థిక భారం తగ్గించామని, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తూ మహిళల కుటుంబ వ్యయాలను తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చేయూత పథకాల ద్వారా పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. బోథ్ నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరమని పేర్కొన్నారు. బోథ్ ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని కొనియాడారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మాదక ద్రవ్యాల నిర్మూలనతో పాటు మహిళా సాధికారత, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు సమాజంలోని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ చొరవతో మహిళా సాధికారతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న నూతన "ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ట్రైనింగ్" కార్యక్రమం, "నషా ముక్త్ భారత్ అభియాన్" పోస్టర్‌ను శనివారం కలెక్టర్ తన ఛాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా ఎంప్లాయబిలిటీ స్కిల్స్ శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మత్తు పదార్థాల వినియోగ నిర్మూలనకు సమాజంలోని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని యువతుల కోసం ప్రత్యేకంగా ఉచిత ఎంప్లాయబిలిటీ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల్లో నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వాలంబన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 2023, 2024, 2025, 2026 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సాఫ్ట్ స్కిల్స్, ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్, ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్, పైథాన్ ప్రోగ్రామింగ్, ఫండమెంటల్స్ వంటి అంశాలపై 45 రోజుల పాటు శిక్షణ అందించనున్నట్లు వివరించారు. ఈ శిక్షణ తరగతులు ఈనెల 29 నుంచి స్థానిక టీటీడీసీ, డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభమవుతాయని తెలిపారు. అర్హులైన యువతులు ఈనెల 26లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం



95027 864380 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ, ఈగల్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17 నుంచి 26 వరకు "నషా ముక్త్ భారత్ సప్తాహ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. "నషా ముక్త్ భారత్ అభియాన్- వికసిత్ భారత్ కి పహచాన్" అనే థీమ్‌తో ఈ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించడం, సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. మాదకద్రవ్యాల బారిన పడిన వారు, సహాయం అవసరమైన వారు 14446 టోల్ ఫ్రీ నేషనల్ డీ-అడిక్షన్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజమే అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి పునాది అని అన్నారు. యువత, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి "నషా ముక్త్ భారత్ సప్తాహ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ జగదీశ్వర్ రావు, డీడబ్ల్యూఓ మిల్కా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న ఆడే గజేందర్

- **మీనాక్షి నటరాజన్‌కు జరిగిన అన్యాయంపై నిరసన**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాజ్యసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌కు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంగతన్ (ఆర్‌జీపీఆర్ఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్ష విజయవంతమైంది. ఈ దీక్షలో ఆదిలాబాద్ జిల్లా ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు (కోఆర్డినేటర్), బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా





ఆర్‌జీపీఆర్ఎస్ నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ సునీల్ పన్వర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ సిద్దేశ్వర్‌లతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో మీనాక్షి నటరాజన్ వంటి సీనియర్ నాయకురాలికి అన్యాయం జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఇలాంటి అప్రజాస్వామిక చర్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన ఆర్‌జీపీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేశారు.

# సొనాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

**ఉద్యమ కెరటం, సొనాల:** బోథ్ నియోజకవర్గంలోని సొనాల మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని సామాజిక సేవకుడు, కాంగ్రెస్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ కోరారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, అలాగే తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేమ్ నరేందర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలను అందజేశారు. సొనాల మండలం విద్యాపరంగా వెనుకబడిన ప్రాంతమని అన్నారు. గ్రామీణ, గిరిజన, ఆర్థికంగా బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడంతో, ఇక్కడ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు అత్యవసరమని పేర్కొన్నారు. ఈ వినతిపై మంత్రి జూపల్లి కృష్ణారావు సానుకూలంగా స్పందించారు. సొనాల మండలంలో పాఠశాల ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించి



తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత విద్యా శాఖ అధికారులను ఆదేశించారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఏజెన్సీ అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ అన్నారు. శనివారం నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వైద్య సేవలు, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా భావించి విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సద్దాం, పవార్ రవీందర్, హెల్త్ సూపర్వైజర్లు సంతోష్, స్వర్ణలత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్ చొరవతో లో-వోల్టేజ్ సమస్యకు పరిష్కారం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామంలో గత కొంతకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న లో-వోల్టేజ్ సమస్యకు సర్పంచ్ చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామంలో విద్యుత్ వోల్టేజ్ సరిగా లేకపోవడంతో గృహావసరాలు, వ్యవసాయ పనులు, ఇతర అవసరాల నిర్వహణలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామ ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. గ్రామస్తుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులు సర్పంచ్ సూచన మేరకు తక్షణమే చర్యలు చేపట్టి, మరమ్మతులు నిర్వహించి కొత్త డీటీఆర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ సరఫరా మెరుగుపడి లో-వోల్టేజ్ సమస్య పూర్తిగా పరిష్కారమైంది. సమస్య పరిష్కారంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకున్న సర్పంచ్‌కు, విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గొర్రెలకు ఉచిత చిటుక వ్యాధి నివారణ టీకాల పంపిణీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని వాంకిడి ప్రాథమిక పశువైద్య కేంద్రం పరిధిలోని బొరిగామ గ్రామంలో శనివారం గొర్రెలకు ఉచితంగా చిటుక వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాథోడ్ వినేష్ ముఖ్య అతిథిగా హాజరై టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంపద ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గొర్రెలు, మేకల సంరక్షణలో భాగంగా ఇలాంటి టీకాలు వేయడం ద్వారా ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. వాంకిడి పశువైద్యాధికారి డాక్టర్ గోవింద్ నాయక్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గొర్రెలకు సోకే చిటుక వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందుగానే టీకాలు వేయడం ద్వారా నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్ అసిస్టెంట్ చంద్రశేఖర్, పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఐలి రాజేశంను బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. గత రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న రాజేశం ఆరోగ్య పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు సంతోష్ కుమార్, జాడి పోషం, దూగుట శ్రీనివాస్, గొల్లపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లా పూర్ ఎంఈవోకు బీఆర్ఎస్వీ వినతిపత్రం

**విద్య వ్యాపారం కాదు..ప్రతి పేద విద్యార్థి కి హక్కు**
**ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి**
**ఫీజుల నియంత్రణ లేకపోతే ఉద్యమం ఉధృతం:బీఆర్ఎస్వీ**



**ఉద్యమ కెరటం,కుత్బుల్లా పూర్**

కుత్బుల్లాపూర్ మండలంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు పెంచుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని బీఆర్ఎస్వీ నాయకులు మండిపడ్డారు. విద్యను వ్యాపారంగా మార్చి తల్లి దండ్రులను దోచుకుంటున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) జెమిని కుమారికి వినతిపత్రం అందజేశారు.చింతల్ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ... “ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందడం ప్రభుత్వ బాధ్యత. కానీ ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు అడ్డు అదుపు లేకుండా ఫీజులు పెంచి విద్యను ధనికులకు మాత్రమే పరిమితం చేస్తున్నాయి” అని ఆవేదన వ్యక్తం చేశారు.కేజీ నుంచి హైస్కూల్ వరకు ప్రతి తరగతికి భారీ ఫీజులు వసూలు చేస్తున్నారని, అదనంగా బుక్స్, యూనిఫామ్, ట్రాన్స్‌పోర్ట్ పేర్లతో తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సాధారణ కార్మికులు, ఉద్యోగులు తమ పిల్లలను మంచి పాఠశాలలో చదివించాలని ఆశపడుతున్నా, ఫీజుల భారం కారణంగా ఆ కల నెరవేరడం లేదన్నారు.ప్రైవేట్ స్కూళ్లపై పర్యవేక్షణ చేపట్టి ఫీజులను నియంత్రించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందని పేర్కొన్న నాయకులు... “సమస్యను వెంటనే పరిష్కరించకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం” అని హెచ్చరించారు.ఇక ప్రభుత్వ పాఠశాలల్లో కూడా పరిస్థి తి దారుణంగా ఉందని నాయకులు విమర్శించారు. పలు పాఠశాలల్లో సరైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ వంటి మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నిశాంత్,రవి కిరణ్,రాజు యాదవ్, జై కృష్ణ, సాయి ప్రసాద్ చింటూ, సాయి రామ్ గౌడ్, సూర్య తేజ, ఈశ్వర్, ప్రభాస్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా పేరుతో రైతాంగానికి మోసం

**హామీలతో అధికారంలోకి వచ్చి రైతులను వంచించిన కాంగ్రెస్**
**యూరియా లేదు..రుణమాఫీ లేదు..రైతు బీమా లేదు**
**రైతులపై రాక్షస పాలన సాగుతోంది:కేపీ వివేకానంద్**
**600 మంది రైతుల్లో 13 మందికే రుణమాఫీ:ఎమ్మెల్యే ఫైర్**



**ఉద్యమ కెరటం,కుత్బుల్లా పూర్**

రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో ప్రజలను హింసిస్తూ రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం రేవంత్ ప్రభుత్వమని బీఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.ఎన్నికల సమయంలో రైతులకు భారీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు రైతులను పూర్తిగా మోసం చేస్తోందని ఆరోపించారు. రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చడం తప్ప రైతులకు అదనంగా ఏమీ చేయలేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ పేరుతో ప్రచారం చేసి, వాస్తవానికి చాలా కొద్దిమందికే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దాదాపు 600 మంది రైతులు ఉండగా కేవలం 13 మందికే రుణమాఫీ వర్తించిందని తెలిపారు. రైతు రుణమాఫీ అంశంపై అసెంబ్లీలో ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా తప్పించుకుందని అన్నారు.

### కేసీఆర్ హయాంలో రైతుకు గౌరవంమాజీ

ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు సకాలంలో విత్తనాలు, యూరియా అందించడంతో పాటు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతాంగానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. తెలంగాణను దేశంలోనే అత్యధిక ధాన్యం దిగుబడి చేసే రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

### రైతు బీమా అమలు చేయాలి

రైతు బీమా పథకం ద్వారా రైతు కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం భరోసా కల్పించిందని, కానీ ప్రస్తుతం రైతులు అకాల మరణం చెందుతున్నా వారి కుటుంబాలకు సరైన సహాయం అందడం లేదని విమర్శించారు. రైతు బీమా పథకాన్ని ప్రతి అర్హుడైన రైతుకు అమలు చేయాలని, లేదంటే రైతుల తరఫున బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.ఈ మీడియా సమావేశంలో మాజీ కార్పొరేటర్లు,వివిధ డివిజన్ల బిఆర్ఎస్ అధ్యక్షులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గపాడు ఫుడ్ పార్క్‌పై విష ప్రచారాలు మానుకోవాలి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** మండలంలోని బుగ్గపాడు ఫుడ్ పార్క్ భూ వివాదంపై అనవసర ఆరోపణలు, విష ప్రచారాలు చేయడం సరికాదని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శనివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్తో కలిసి సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుగ్గపాడు ఫుడ్ పార్క్ అంశంపై కొందరు వ్యక్తులు, రాజకీయ పార్టీలు వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఫుడ్ పార్క్ ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 2008 నుంచి 2014 మధ్య రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూసేకరణ చేపట్టి 61.13 ఎకరాల్లో మెగా ఫుడ్ పార్క్ను ఏర్పాటు చేశారని వివరించారు. సుమారు రూ.109 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కొంత కాలం నిర్వీర్యంగా ఉన్న ఫుడ్ పార్క్ను ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించి అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందన్నారు. బుగ్గపాడులో రూ.650 కోట్లకు పైగా పెట్టుబడితో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు దీపక్ నెక్స్ట్ జెన్ ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 3వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. ఇతర ప్రాంతాలను పరిశీలించిన అనంతరం స్థానికుల ఆమోదంతోనే బుగ్గపాడును ఎంపిక చేసినట్లు చెప్పారు. ఫుడ్ పార్క్ ఏర్పాటులో ఎలాంటి అవకతవకలు లేవని, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేలా చేయడం సరికాదని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రెహనా కమల్ పాషా, బొంతు సుమలత, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కుటుంబానికి కేటీఆర్ పరామర్శ





- **"ధైర్యంగా ఉండండి.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది"**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన రైతు పాండురంగ ఆత్మహత్య ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించిన ఆయన పార్టీ తరఫున రూ.3 లక్షల ఆర్థి క సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలను కేవలం మరణాలుగా కాకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జరుగుతున్న "ప్రభుత్వ హత్యలు"గా భావిస్తున్నానని పేర్కొన్నారు. పండించిన పంటను విక్రయించేందుకు నెల రోజులుగా మార్కెట్ యార్డులో ఎదురుచూసినా కనీస మద్దతు ధర లభించకపోవడం, అధికారుల వేధింపుల కారణంగానే రైతు పాండురంగ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మార్కెట్ యార్డుల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. రైతులు ఇలాంటి క్లి ష్ట పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ధైర్యంగా సమస్యలపై పోరాడాలని సూచించారు. మరణించిన ప్రతి రైతు కుటుంబానికి తక్షణమే రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతులు అధైర్యపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ ఎల్ల ప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాపాలనతో పెరిగిన విశ్వాసం

- **సమగ్ర నివేదికలు సమర్పించాలలి**
- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ‘ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక’లో భాగంగా 99 రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమం కింద శాఖల వారీగా చేపట్టిన పనులు, ప్రజలకు అందించిన సేవలు, పరిష్కరించిన సమస్యలు, లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలపై సమగ్ర నివేదికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నివేదికలు కేవలం గణాంకాలకు పరిమితం కాకుండా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను స్పష్టంగా ప్రతిబింబించేలా రూపొందించాలని సూచించారు. ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరిగిందని పేర్కొన్నారు. శాఖల వారీ నివేదికల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తామని, ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా నిరంతర పర్యవేక్షణతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కజ్జర్ల లో పండిన ప్రతి గింజ కొనుగోలు

- **కలెక్టర్ రాజర్షి షా, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డికి రైతుల ఘన సన్మానం**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో ఇటీవల నూతనంగా ప్రారంభించిన జొన్నల కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసినందుకు కృతజ్ఞతగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిలను గ్రామ రైతులు ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల ఉత్పత్తులకు పూర్తి మద్దతు లభించడంతో సంతృప్తి వ్యక్తం చేసిన గ్రామ సర్పంచ్ వెలమ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్ సమావేశ మందిరంలో శనివారం ఇరువురిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లా డుతూ పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం ద్వారా తమకు ఆర్థిక భరోసా లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలు రైతుల సంక్షేమానికి దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద చింతలపల్లి దేవారెడ్డి , మాజీ ఎంపీటీసీ కమలాకర్, ఏఎంసీ డైరెక్టర్ ముదిల్ల పోశెట్టి, మునిగంటి శ్రీనివాస్, తలారి తిరుపతి, చింతలపల్లి కేశవరెడ్డి, శరత్ శ్రీనివాస్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం.. నిరుపేద కుటుంబాలకు కెఎస్ఎస్ హెల్త్ కార్డుల పంపిణీ

- **పేదల వైద్య ఖర్చులకు ఊరట**
- **50% రాయితీతో వైద్య సేవలు**
- **ఆరోగ్య రక్షణకు కెఎస్ఎస్ ముందడుగు**
- **సామాజిక సేవకుడు గోగికర్ శివకుమార్**

**ఉద్యమ కెరటం,కాప్రా :** సమాజంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కెఎస్ఎస్ చారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో కాప్రా డివిజన్ పరిధిలోని బంజారా కాలనీలో 100 నిరుపేద కుటుంబాలకు కెఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నయీమ్ సహకారంతో సామాజిక సేవకుడు గోగికర్ శివకుమార్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డులను పంపిణీ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న వైద్య ఖర్చుల కారణంగా పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అలాంటి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు కెఎస్ఎస్ హెల్త్ కార్డులను అందిస్తున్నామని పేర్కొన్నారు.ఈ హెల్త్ కార్డుల ద్వారా గుర్తింపు పొందిన పలు ఆసుపత్రుల్లో చికిత్సలు, వైద్య పరీక్షలు, ఇతర ఆరోగ్య సేవలపై 50 శాతం వరకు ప్రత్యేక రాయితీ పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సదుపాయం వల్ల అత్యవసర పరిస్థితుల్లో కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని చెప్పారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన పొందింది. హెల్త్ కార్డులు అందుకున్న కుటుంబాలు కెఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాయి.

# జియో ఐపీవోతో కొత్త చరిత్ర

**న్యూఢిల్లీ, జూన్ 20 :** దేశీయ మూలధన మార్కెట్ల నియంత్రణ సంస్థ వద్ద వరుసగా భారీ పబ్లిక్ ఇష్యూలు క్యూకడుతున్న వేళ, జియో ప్లాట్‌ఫామ్స్ కూడా చరిత్ర సృష్టించే అడుగు వేసింది. శుక్రవారం జియో ప్లాట్‌ఫామ్స్ తమ ప్రారంభ ప్రజా వాటా విక్రయం కోసం ముసాయిదా పత్రాలను మార్కెట్ నియంత్రణ సంస్థకు సమర్పించింది. దాదాపు రూ.37,700 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఈ ప్రజా వాటా విక్రయం ముందుకు వస్తోంది. ఇది విజయవంతమైతే దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతి పెద్ద ప్రజా వాటా విక్రయంగా నిలవనుంది. ప్రస్తుతం హ్యుందాయ్ మోటార్ పేరిట ఉన్న రూ.27,870 కోట్ల రికార్డు చెరిగిపోనుంది. ఈ ప్రజా వాటా విక్రయం కింద సుమారు 27 కోట్ల తాజా షేర్లను జారీ చేయనున్నారు. ఇది జియోలో దాదాపు 2.9 శాతం వాటాకు సమానం. సంస్థ విలువను సుమారు 137 బిలియన్ డాలర్లుగా లెక్కించి ఈ భారీ ఆఫర్‌ను తెస్తున్నారు. సమీకరించే నిధుల్లో దాదాపు రూ.27,500 కోట్లను అప్పుల చెల్లింపులకే వినియోగించనున్నట్లు సమాచారం. జియో ఇప్పటికే దేశీయ టెలికాం, డిజిటల్ సేవలు, ఐదో తరం సేవలు, బ్రాడ్‌బ్యాండ్ రంగాల్లో కీలక స్థానాన్ని సంపాదించుకున్న నేపథ్యంలో ఈ ఇష్యూకు పెట్టుబడిదారుల్లో గట్టి ఆసక్తి నెలకొనే అవకాశం ఉంది. రిలయన్స్ వార్షిక సర్వసభ్య సమావేశంలో సంస్థ అధినేత ముకేశ్ అంబానీ మరో కీలక ప్రకటన చేశారు. రిలయన్స్ వ్యాపార వారసత్వ బదిలీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని, తన ముగ్గురు వారసులు ఇప్పటికే రోజువారీ కార్యకలాపాల్లో నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. ఇషా కన్స్యూమర్ వ్యాపారాన్ని, ఆకాశ్ టెక్నాలజీ విభాగాన్ని, అనంత్ ఇంధన రంగాన్ని ముందుకు నడిపిస్తున్నారని వెల్లడించారు. గత మూడేళ్లుగా వీరంతా రిలయన్స్ బోర్డులో భాగస్వాములై సంస్థ భవిష్యత్తును మరింత బలపరుస్తున్నారని అంబానీ పేర్కొన్నారు. సంస్థ పేరు ప్రతిష్ఠలను మరింత ఎత్తుకు తీసుకెళ్లగల సామర్థ్యం వారిలో ఉందని ఆయన స్పష్టం చేశారు.



ఇక రిలయన్స్ రిటైల్, కన్స్యూమర్ ఉత్పత్తులు, కొత్త ఇంధన రంగాల్లోనూ సంస్థ దూకుడు కొనసాగించనుంది. వచ్చే నాలుగేళ్లలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఆదాయం లక్ష కోట్ల రూపాయల మార్కును తాకవచ్చని ఇషా అంబానీ పేర్కొన్నారు. దేశంలోనే అతి పెద్ద ఎఫ్‌ఎంసీజీ సంస్థగా ఎదగడమే లక్ష్యమని తెలిపారు. మరోవైపు జమ్‌నగర్ రిఫైనరీని ప్రపంచంలోనే తొలి పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి కలిగిన శుద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అనంత్ అంబానీ వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ టు కెమికల్స్ వ్యాపారం రూ.6.62 లక్షల కోట్ల ఆదాయం సాధించిందని చెప్పారు. జియో భవిష్యత్ వ్యూహంలో శాటిలైట్ కమ్యూనికేషన్, కృత్రిమ మేధ, గ్రీన్ ఎనర్జీ రంగాలకు పెద్దపీట వేస్తోంది. దేశంలోని మారుమూల గ్రామాలు, ద్వీపాలు, సరిహద్దు ప్రాంతాలకూ కనెక్టివిటీ అందించేందుకు సావరిన్ లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు ఆకాశ్ అంబానీ ప్రకటించారు. ఇదే సమయంలో రిలయన్స్ ఇంటెలిజెన్స్ పేరిట దేశీయ అవసరాలకు అనుగుణంగా కృత్రిమ మేధ సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ భావిస్తోంది. వ్యవసాయం నుంచి విద్య, సంస్థాగత రంగాల వరకు అన్ని భారతీయ భాషల్లో పని చేసే కృత్రిమ మేధ వేదికను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రిలయన్స్ ముందుకు సాగుతోంది. మొత్తంగా చూస్తే జియో ఐపీవో కేవలం ఒక ప్రజా వాటా విక్రయం మాత్రమే కాకుండా, రిలయన్స్ సామ్రాజ్యంలో తదుపరి దశ ప్రారంభానికి సంకేతంగా మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# విజయవాడలో అడుగుపెట్టిన 'టోయింగ్'

## రూ.99లోపే భోజనాలు..

## అదనపు ఛార్జీలు లేవు

**విజయవాడ, జూన్ 20 :** దేశవ్యాప్తంగా తక్కువ ధరల్లో ఆహారాన్ని ఇంటి వద్దకు అందించే సేవలతో గుర్తింపు పొందుతున్న ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వేదిక 'టోయింగ్' విజయవాడ నగరంలో అధికారికంగా తన కార్యకలాపాలను ప్రారంభించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో పూణేలో ప్రారంభమైన ఈ సంస్థ, కొద్ది నెలల్లోనే వేగంగా విస్తరించి విజయవాడతో కలిపి దేశంలోని 49 నగరాల్లో సేవలు అందిస్తోంది. వినియోగదారులకు రెస్టారెంట్‌లో ఉన్న ధరలకే లేదా వాటికంటే తక్కువ ధరకే ఆహార పదార్థాలను అందించడం ఈ వేదిక ప్రధాన ప్రత్యేకతగా సంస్థ పేర్కొంది. ఇతర ఆన్‌లైన్ ఆహార పంపిణీ సంస్థల్లో సాధారణంగా ఉండే ప్లాట్‌ఫాం ఫీజులు, అదనపు ప్యాకింగ్ చార్జీలు లేకుండా సేవలు అందిస్తున్నట్లు వెల్లడించింది. దీంతో బిర్యానీలు, బర్గర్లు, టిఫిన్లు, స్నాక్స్, ఇతర ఆహార పదార్థాలను రూ.99లోపే పొందే అవకాశం వినియోగదారులకు లభిస్తుందని సంస్థ వర్గాలు తెలిపాయి. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో తక్కువ ఖర్చుతో భోజనం పొందాలనుకునే వర్గాలకు ఇది ఉపయోగకరంగా మారుతుందని భావిస్తున్నారు. విజయవాడలో విద్యార్థులు, ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన యువత, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఉండటంతో ఈ నగరాన్ని విస్తరణకు కీలక కేంద్రంగా ఎంపిక చేసినట్లు సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా ప్రతిరోజూ ఆన్‌లైన్ ద్వారా ఆహారం ఆర్డర్ చేసే వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని సేవలను రూపకల్పన




చేసినట్లు తెలిపింది. ఇప్పటికే నగరంలోని పలు ప్రముఖ ఆహార కేంద్రాలు ఈ వేదికతో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. బెంగుళూరు భవన్, ఆర్‌ఆర్ దర్బార్, సదరన్ స్పైస్, స్వీట్ మ్యాజిక్, ప్యారడైజ్, మెక్‌డొనాల్డ్స్, క్రీమ్ స్టోన్ తదితర సంస్థల ఆహార పదార్థాలు ఈ వేదికలో అందుబాటులోకి వచ్చాయి. దక్షిణ భారత వంటకాలు, చైనీస్ వంటలు, పిజ్జాలు, మోమోలు, బిర్యానీలు, తీపి పదార్థాలు సహా విభిన్న రకాల ఆహార ఎంపికలను వినియోగదారులు ఒకే వేదికలో పొందగలరని సంస్థ తెలిపింది. దేశవ్యాప్తంగా ఇప్పటికే ఈ యాప్‌కు 45 లక్షలకు పైగా డౌన్‌లోడ్‌లు నమోదైనట్లు సంస్థ పేర్కొంది. వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో విస్తరణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం విజయవాడతో పాటు కేరళలోని త్రిస్సూర్, కొచ్చి, కోళిక్కోడ్ నగరాల్లో కూడా సేవలను విస్తరించింది. రోజువారీ ఆహార అవసరాల కోసం ఆన్‌లైన్ సేవలపై ఆధారపడుతున్న వినియోగదారులకు తక్కువ ధరలో భోజనం అందించే ప్రత్యామ్నాయ వేదికగా 'టోయింగ్' నిలవొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# లగ్జరీ ఈవీ మార్కెట్లో బీఎండబ్ల్యూ హవా

## సరికొత్త 'సీఈ 04' ఎలక్ట్రిక్ స్కూటర్ లాంచ్!

**న్యూఢిల్లీ, జూన్ 20 :** పెర్ఫార్మెన్స్ బైక్‌లను ఇష్టపడే వారికి బీఎండబ్ల్యూ తీసుకొచ్చిన సీఈ 04 ఎలక్ట్రిక్ స్కూటర్ ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇది సాధారణ నగర వినియోగానికి ఉద్దేశించిన ఈవీ స్కూటర్ కాదు. భారీ పవర్, ప్రీమియం టెక్నాలజీ, విభిన్న డిజైన్, లగ్జరీ ఫీచర్లతో రూపొందించిన ఈ మోడల్ విలాసవంతమైన ప్రయాణానుభూతిని కోరుకునే వారిని లక్ష్యంగా చేసుకుంది. భారత మార్కెట్లో దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.15.25 లక్షలు కాగా, నగరాన్ని బట్టి ఆన్‌రోడ్ ధర సుమారు రూ.15.8 లక్షల వరకు వెళ్తోంది. బీఎండబ్ల్యూ సీఈ 04లో 31 కిలోవాట్ శక్తిని ఉత్పత్తి చేసే ఎలక్ట్రిక్ మోటార్‌ను అమర్చారు. ఇది దాదాపు 41 నుంచి 42 హెచ్‌పీ వరకు పవర్, 61 నుంచి 62 ఎన్‌ఎం టార్క్‌ను ఇస్తుంది. గంటకు 120 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందించగల ఈ స్కూటర్ 0 నుంచి 50 కిలోమీటర్ల వేగాన్ని సుమారు 2.6 సెకన్లలో అందుకుంటుందని కంపెనీ పేర్కొంటోంది. ఈ పనితీరు పరంగా చూస్తే 300 సీసీ నుంచి 400 సీసీ పెట్రోల్ స్కూటర్లు లేదా మధ్యస్థాయి మోటార్‌సైకిళ్లకు దగ్గరగా ఉండే అనుభూతిని ఇస్తుందని ఆటో నిపుణులు చెబుతున్నారు. ఈ స్కూటర్‌లో 8.9 కిలోవాట్ అవర్ సామర్థ్యం గల బ్యాటరీ ప్యాక్‌ను ఇచ్చారు. పూర్తి ఛార్జ్‌తో సుమారు 130 కిలోమీటర్ల రేంజ్‌ను అందిస్తుందని అధికారిక వివరాలు చెబుతున్నాయి. సాధారణ చార్జర్‌తో 0 నుంచి 100 శాతం వరకు చార్జ్ కావడానికి సుమారు 4.2 గంటలు పడుతుంది. కొన్ని ఫాస్ట్ ఛార్జింగ్ ఎంపికల్లో సమయం మరింత తగ్గే అవకాశం కూడా ఉంది. దీని వల్ల నగర ప్రయాణాలతో పాటు



వీకెండ్ రైడ్లకు కూడా ఇది సరిపడే ఈవీగా కనిపిస్తోంది. ఫీచర్ల విషయానికి వస్తే బీఎండబ్ల్యూ తన ప్రీమియం ఇమేజ్‌కు తగ్గట్టే ఈ స్కూటర్‌ను తీర్చిదిద్దింది. ఇందులో 10.25 అంగుళాల పెద్ద టీఎఫ్‌టీ డిస్‌ప్లే, బ్లూటూత్ కనెక్టివిటీ, నావిగేషన్ సపోర్ట్, కీ లెస్ ఆపరేషన్, యూఎస్‌బీ ఛార్జింగ్, పలు రైడింగ్ మోడ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఫీచర్లు ఉన్నాయి. కొన్ని ఆప్షనల్ ప్యాకేజీలలో ఏబీఎస్ ప్రో, అడాప్టివ్ హెడ్‌లైట్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ వంటి అదనపు ఫీచర్లు కూడా లభిస్తాయి. ముందు, వెనుక డిస్క్ బ్రేకులు, ఏబీఎస్ వంటి భద్రతా వ్యవస్థలతో ఇది మరింత స్థిరమైన రైడింగ్‌ను అందించేందుకు సిద్ధమైంది. బీఎండబ్ల్యూ సీఈ 04లో మరో ముఖ్యాంశం దీని బరువు. కర్బ్ వెయిట్ సుమారు 231 కిలోలు. ఇది చాలా స్కూటర్లతో పోలిస్తే భారీగా ఉంటుంది. పార్కింగ్ సమయంలో లేదా మాన్యువల్‌గా కదిలించేటప్పుడు కొంత బరువుగా అనిపించవచ్చు. కానీ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఈ బరువే స్థిరత్వాన్ని పెంచుతుందని సమీక్షలు చెబుతున్నాయి. పొడవైన వీల్‌బేస్, పెద్ద పరిమాణం కారణంగా ఇది సాధారణ యాక్టివా తరహా స్కూటర్ అనుభూతిని ఇవ్వదు. బదులుగా ఒక మాక్సీ-స్కూటర్ తరహా ప్రీమియం రైడింగ్ ఫీల్ ఇస్తుంది. అయితే ఈ స్కూటర్ అందరికీ సరిపోదు. రోజువారీ తక్కువ ఖర్చుతో ఆఫీస్ వెళ్లడం, సిటీ ట్రాఫిక్‌లో సులభంగా తిరగడం మాత్రమే లక్ష్యమైతే ఇది సరైన ఎంపిక కాదు. ఎందుకంటే దీని ధర, బరువు, ప్రీమియం స్వభావం దాన్ని ఒక ప్రత్యేక విభాగంలో నిలబెడుతున్నాయి. పెట్రోల్ పెర్ఫార్మెన్స్ స్కూటర్ లేదా మధ్యస్థాయి స్పోర్టీ బైక్ స్థాయి శక్తి కావాలనుకునే వారు, అదే సమయంలో ఎలక్ట్రిక్ భవిష్యత్తులోకి అడుగు పెట్టాలనుకునే వారికి ఇది ఆకర్షణీయమైన ఆప్షన్‌గా కనిపిస్తోంది. బీఎండబ్ల్యూ బ్రాండ్, ప్రత్యేక డిజైన్, హైటెక్ ఫీచర్లు, అరుదైన రోడ్ ప్రెజెన్స్‌ను విలువ చేసే వినియోగదారులకు సీఈ 04 నిజంగా ఒక స్టేటస్ సింబల్‌గా మారే అవకాశం ఉంది.



# బంగారం మళ్లీ పెరిగింది

**హైదరాబాద్, జూన్ 20:** దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఈ రోజు మళ్లీ పెరిగాయి. శనివారం ఉదయం నుంచి పసిడి రేట్లు పైకి కదలడంతో కొనుగోలుదారులపై మరోసారి భారం పడింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరపై రూ.220 పెరగగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.200, 18 క్యారెట్ల బంగారం ధర రూ.170 చొప్పున పెరిగింది. గుడ్ రిటర్న్స్ వివరాల ప్రకారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,080కు చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,33,900గా, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,09,560గా నమోదైంది. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ పట్టణాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,46,080గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,33,900, 18 క్యారెట్ల బంగారం రూ.1,09,560గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ నగరాల్లో కూడా ఇదే ధరలు నమోదయ్యాయి. దీంతో తెలుగు రాష్ట్రాల్లో పసిడి రేట్లు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు పెరిగాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,48,370కు చేరగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,36,000, 18 క్యారెట్ల బంగారం రూ.1,13,700గా నమోదైంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, వడోదరా, ఇండోర్, కాన్పూర్ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం రూ.1,46,080గా, 22 క్యారెట్ల బంగారం రూ.1,33,900గా, 18 క్యారెట్ల బంగారం రూ.1,09,560గా ఉంది. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న మార్పులు, డాలర్ బలపడటం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి వంటి అంశాల ప్రభావంతో దేశీయంగా బంగారం ధరలు ఊగిసలాటకు లోనవుతున్నాయి. ఒక రోజు భారీగా పడిపోతే, మరుసటి రోజు మళ్లీ పెరగడం కనిపిస్తోంది. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కొనసాగుతున్న సమయంలో బంగారం ధరల ఈ పెరుగుదల వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇక రాబోయే రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ ధోరణి ఆధారంగానే పసిడి ధరల్లో మరిన్ని మార్పులు ఉండే అవకాశముందని బులియన్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

# ఫోన్‌పే వాలెట్‌కే ఇనాక్టివిటీ రుసుము

**న్యూఢిల్లీ, జూన్ 20:** ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పే తమ వాలెట్‌ను చాలాకాలంగా ఉపయోగించని వినియోగదారులకు 'ఇనాక్టివిటీ' నోటిఫికేషన్లు పంపుతుండటంతో చాలా మందిలో గందరగోళం నెలకొంది. ఫోన్‌పే ఖాతా, యూపీఐ, వాలెట్ అన్నీ ఒకటేనని చాలామంది భావించడం వల్లే ఈ అయోమయం ఏర్పడుతోంది. అయితే ఇవి మూడు వేర్వేరు చెల్లింపు వ్యవస్థలని, వాటి పని విధానం కూడా భిన్నంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రోజువారీ డిజిటల్ లావాదేవీల్లో ఈ తేడాలను తెలుసుకోవడం వినియోగదారులకు చాలా అవసరం. ఫోన్‌పేలో యూపీఐ, వాలెట్ రెండూ వేర్వేరు సేవలు. యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే డబ్బు నేరుగా వినియోగదారుడి బ్యాంకు ఖాతా నుంచి కట్ అవుతుంది. కానీ ఫోన్‌పే వాలెట్ ఒక ముందస్తు చెల్లింపు సాధనం. ఇందులో ముందుగా డబ్బులు జమ చేసుకుని, ఆ తర్వాత వాటిని వినియోగిస్తారు. ఇది బ్యాంకు ఖాతా నుంచి నేరుగా పనిచేసే విధానం కాదు. అందువల్ల ఫోన్‌పే విధిస్తున్న ఇనాక్టివిటీ రుసుము కేవలం వాలెట్‌కే వర్తిస్తుంది. చాలామంది రోజూ ఫోన్‌పే ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు చేస్తుంటారు. అయినప్పటికీ తమకు ఇనాక్టివిటీ నోటిఫికేషన్ ఎందుకు వచ్చిందో అర్థం కాక ఆశ్చర్యపోతున్నారు. దీనికి కారణం యూపీఐ వినియోగం, వాలెట్ వినియోగం వేర్వేరుగా లెక్కించబడటమే. వినియోగదారుడు రోజూ యూపీఐతో చెల్లింపులు చేసినా, వాలెట్‌ను ఏడాది పాటు అసలు వాడకపోతే ఆ వాలెట్ 'ఇనాక్టివ్'గానే పరిగణించబడుతుంది. అందుకే యాప్ వాడుతున్నప్పటికీ వాలెట్‌కు ఇనాక్టివిటీ హెచ్చరిక రావచ్చు. మొత్తం మీద ఫోన్‌పే ఇనాక్టివిటీ రుసుము అనేది కేవలం వాలెట్‌కే వర్తిస్తుందని, యూపీఐ లేదా బ్యాంకు ఖాతాపై దాని ప్రభావం ఉండదని వినియోగదారులు గుర్తుంచుకోవాలి. ఒకవేళ ఇలాంటి నోటిఫికేషన్ వస్తే ముందుగా వాలెట్ స్థితిని పరిశీలించి, దాన్ని కొనసాగించాలా వద్దా అన్నది నిర్ణయించుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.





# మూడో వన్డేలో ఆఫ్ఘన్ తొలుత బ్యాటింగ్

**చెన్నై, జూన్ 20:** భారత్–ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరుగుతున్న మూడో వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో విజయం సాధించిన భారత జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుంది. చివరి వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు బరిలోకి దిగింది. ఈ మ్యాచ్ కోసం భారత జట్టులో మూడు మార్పులు చేశారు. ప్రసిద్ధ్ కృష్ణ, హర్ష్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో అవకాశం కల్పించారు. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టు కూడా నాలుగు మార్పులతో బరిలోకి దిగింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన ఆ జట్టు, చివరి వన్డేలో గెలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తోంది. చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు పోటాపోటీగా రాణించేందుకు సిద్ధమయ్యాయి. భారత జట్టు క్లీన్‌స్వీప్‌పై దృష్టి పెట్టగా, ఆఫ్ఘనిస్తాన్ గెలుపుతో సిరీస్‌ను ముగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# భారత్-ఐర్లాండ్ మ్యాచ్‌ల సమయం ముందుకు..

- సూర్యవంశీ క్రేజ్ ప్రభావమేనా?
- రాత్రి 7.30కు బదులు సాయంత్రం 6 గంటలకు మ్యాచ్‌లు?
- యువ సంచలనం వైభవ్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి






**న్యూఢిల్లీ, జూన్ 20 :** భారత క్రికెట్ జట్టు ఐర్లాండ్ పర్యటనకు సిద్ధమవుతున్న వేళ, రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు సంబంధించి మ్యాచ్‌ల సమయాల్లో మార్పు చోటుచేసుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. బెల్ఫాస్ట్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో జరగనున్న టీ20 మ్యాచ్‌లను ముందుగా ప్రకటించిన సమయాల కంటే గంటన్నర ముందుగా నిర్వహించాలనే ఆలోచనపై చర్చ జరుగుతోంది. అయితే అధికారిక షెడ్యూల్ ప్రకారం రెండు మ్యాచ్‌లు స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు, భారత కాలమానం ప్రకారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. క్రికెట్ వర్గాల్లో మాత్రం ఈ సమయ మార్పు వెనుక భారత ప్రేక్షకుల వీక్షణను పెంచాలనే ఉద్దేశమే ప్రధాన కారణమని చర్చ సాగుతోంది. ముఖ్యంగా యువ ప్రేక్షకులను ఆకర్షించేందుకు ప్రసార సంస్థలు, నిర్వాహకులు ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### వైభవ్ సూర్యవంశీ చుట్టూ పెరుగుతున్న క్రేజ్

ఈ చర్చలన్నింటికీ కేంద్రబిందువుగా నిలుస్తున్న పేరు యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ. కేవలం 15 ఏళ్ల వయసులో భారత జట్టులో చోటు దక్కించుకున్న అతడు అంతర్జాతీయ అరంగేట్రానికి సిద్ధమవుతుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఐపీఎల్‌లో తన దూకుడు ఆటతో గుర్తింపు పొందిన సూర్యవంశీని ప్రత్యక్షంగా చూడాలని యువత, విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అతని ఎంపికతో ఐర్లాండ్ సిరీస్‌పై అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి పెరిగినట్లు కనిపిస్తోంది. టికెట్లకు మంచి డిమాండ్ ఉందని అభిమానుల చర్చల్లో కూడా కనిపిస్తోంది. సూర్యవంశీపై అంచనాలు పెరుగుతున్నప్పటికీ, ఇటీవల అతని ఫామ్ మాత్రం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కొన్ని మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో పరుగులు చేయకపోవడంతో అతడు మళ్లీ తన సహజ ఆటను ప్రదర్శించగలడా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే అతని ప్రతిభపై సెలెక్టర్లు, బీసీసీఐ విశ్వాసం కొనసాగిస్తున్నాయి. అతని వయసును దృష్టిలో ఉంచుకుని ఒత్తిడి తగ్గించే చర్యలు కూడా బోర్డు తీసుకుంటోందని సమాచారం. యువ ఆటగాడి మానసిక స్థితి, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

### అందరి చూపు బెల్ఫాస్ట్‌పైనే

భారత్–ఐర్లాండ్ సిరీస్ సాధారణ ద్వైపాక్షిక సిరీస్‌గా కాకుండా, భారత క్రికెట్‌లో కొత్త తరం ఆరంభానికి సంకేతంగా మారింది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగుతుండగా, వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం జరిగే అవకాశంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మ్యాచ్‌ల సమయ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉన్నప్పటికీ, ఈ సిరీస్ చుట్టూ ఏర్పడిన ఉత్కంఠకు యువ సంచలనం సూర్యవంశీ ప్రధాన కారణంగా నిలుస్తున్నాడనడంలో సందేహం లేదు. ఇప్పుడు అందరి చూపు బెల్ఫాస్ట్‌పైనే ఉంది. అభిమానుల అంచనాలను అతడు అందుకుంటాడా? లేక అంతర్జాతీయ ఒత్తిడిలో తడబడతాడా? అన్నది ఈ సిరీస్‌లో తేలనుంది.

# హార్దిక్ పాండ్యా గాయం.. టీమిండియాకు షాక్

### ఇంగ్లండ్ వన్డే సిరీస్‌తో పాటు ఆసియా క్రీడలకు కూడా దూరం

**న్యూఢిల్లీ, జూన్ 20 :** టీమిండియాకు మరోసారి గాయాల రూపంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో శిక్షణ పొందుతున్న సమయంలో అతడి తొడ కండరానికి గాయం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గాయం తీవ్రత కారణంగా కోలుకోవడానికి అనుకున్నదానికంటే ఎక్కువ సమయం పడుతుందని వైద్య బృందం అంచనా వేసింది. దీంతో హార్దిక్ పాండ్యా ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లకు మాత్రమే కాకుండా సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల జట్టులోనూ సెలెక్టర్లు అతడిని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పరిణామం 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని అతడి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగానే తీసుకున్న నిర్ణయమని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం పాండ్యా బౌలింగ్ చేయడానికి పూర్తిగా ఫిట్‌గా లేదని సమాచారం. ఈ నేపథ్యంలో అతడికి పూర్తి విశ్రాంతి ఇచ్చి, పూర్తిగా కోలుకున్న తర్వాతే తిరిగి జట్టులోకి తీసుకురావాలని బోర్డు భావిస్తోంది. ఇదిలా ఉండగా, మరో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌పై కూడా అనిశ్చితి కొనసాగుతోంది. ఐపీఎల్ ఫైనల్ సమయంలో కండరాల నొప్పితో బాధపడిన కోహ్లీ ప్రస్తుతం లండన్‌లో చికిత్స తీసుకుంటూ కోలుకుంటున్నాడు. ఇంగ్లండ్ టూర్‌కు అతను అందుబాటులో ఉంటాడా లేదా అన్నది జూన్ 22న జరిగే ఫిట్‌నెస్ టెస్ట్ తర్వాతే స్పష్టమవుతుందని బీసీసీఐ తెలిపింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ప్రస్తుత వన్డే సిరీస్‌కు కూడా కోహ్లీ దూరంగా ఉన్నాడు. ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ అయితేనే అతడు జూలైలో జరిగే ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు ఎంపిక కానున్నాడు. సీనియర్ ఆటగాళ్ల గాయాల సమస్యలు గిల్ నాయకత్వంలోని యువ టీమిండియాకు కొత్త సవాలుగా మారుతున్నాయి.





# మెస్సీ హ్యాట్రిక్‌తో అర్జెంటీనా ఘనవిజయం

### ఫిఫా వరల్డ్ కప్‌లో అల్జీరియా ఫిర్యాదుతో హాట్ హాట్ వివాదం

**న్యూఢిల్లీ, జూన్ 20 :** ప్రపంచ క్రీడా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫిఫా వరల్డ్ కప్ ప్రారంభ దశలోనే సంచలన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఒకవైపు రికార్డుల వర్షం కురుస్తుండగా, మరోవైపు అనూహ్య వివాదాలు ఫుట్‌బాల్ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. తాజాగా అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ హ్యాట్రిక్ గోల్స్‌తో అదరగొట్టిన మ్యాచ్ తర్వాత, ఓడిపోయిన అల్జీరియా జట్టు ఫిఫాకు అధికారిక ఫిర్యాదు చేయడం ఇప్పుడు అంతర్జాతీయ క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గ్రూప్ స్టేజ్ తొలి మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు 3–0 తేడాతో అల్జీరియాపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌లో మెస్సీ మూడు అద్భుత గోల్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. అయితే ఈ పరాజయాన్ని జీర్ణించుకోలేని అల్జీరియా ఫుట్‌బాల్ సమాఖ్య, మ్యాచ్ అనంతరం ఫిఫాకు అధికారికంగా కంప్లైంట్ చేసింది. మ్యాచ్ సమయంలో మెస్సీ చేసిన ఒక చర్యపై రిఫరీ సరైన నిర్ణయం తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. అల్జీరియా ఆరోపణల ప్రకారం, ఒక సందర్భంలో మెస్సీ కాలు తమ జట్టు కెప్టెన్‌పై బలంగా తాకినప్పటికీ రిఫరీ దానిని తీవ్రమైన ఫౌల్‌గా పరిగణించలేదని, రెడ్ కార్డ్ ఇవ్వాల్సిన పరిస్థితిని కూడా పట్టించుకోలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ అలెక్సిస్ మెక్ అలిస్టర్ తమ ఆటగాడిని మోచేతితో తోసిన ఘటనను కూడా రిఫరీ పట్టించుకోలేదని అల్జీరియా ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మ్యాచ్‌కు పోలాండ్‌కు చెందిన ప్రముఖ రిఫరీ షిమోన్ మార్సినియాక్ బాధ్యతలు నిర్వహించడం కూడా ఇప్పుడు వివాదానికి మరింత ఆజ్యం పోస్తోంది. 2022 వరల్డ్ కప్ ఫైనల్‌లో కూడా అర్జెంటీనా జట్టుకు సంబంధించిన మ్యాచ్‌కే ఆయన రిఫరీగా వ్యవహరించిన విషయం గుర్తు చేస్తూ, అల్జీరియా పక్షం ఆయన నిర్ణయాలపై పక్షపాత ఆరోపణలు చేస్తోంది. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.మొత్తానికి, మెస్సీ అద్భుత ప్రదర్శనతో అర్జెంటీనా విజయాన్ని అందుకున్నప్పటికీ, మ్యాచ్ అనంతర ఫిర్యాదుతో వరల్డ్ కప్ వేదికపై కొత్త వివాదానికి తెరలేచింది. ఫిఫా ఈ ఆరోపణలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు క్రీడా ప్రపంచం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# విదేశీ ప్లేయర్లపై గావస్కర్ ఆగ్రహం



**న్యూఢిల్లీ, జూన్ 20 :** ఐపీఎల్ టోర్నమెంట్‌ను తేలికగా తీసుకుంటున్న కొంతమంది విదేశీ క్రికెటర్ల తీరుపై టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బీసీసీఐ ఎన్ని నిబంధనలు తీసుకొచ్చినా, కొంతమంది ఆటగాళ్లు ఏదో ఒక కారణం చూపుతూ టోర్నీ మధ్యలోనే జట్టును వీడుతున్నారని ఆయన విమర్శించారు. జట్టులో అవకాశాలు లభించకపోతే గాయాల సాకుతో స్వదేశానికి వెళ్లి అక్కడి స్థానిక టోర్నీల్లో పాల్గొంటున్నారని గావస్కర్ ఆరోపించారు. ఇలాంటి తీరును నియంత్రించడానికి బీసీసీఐ మరింత కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, వేలంలో కొనుగోలు చేసిన తర్వాత అందుబాటులో లేకపోతే ప్లేయర్లపై రెండేళ్ల నిషేధం విధిస్తున్నారని గుర్తుచేసిన గావస్కర్, అదే విధంగా టోర్నీ మధ్యలో జట్టును వీడే విదేశీ ఆటగాళ్లపైనా కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే మ్యాచ్ ఫీజుల్లో కోత విధించడంతో పాటు, అవసరమైతే కాంట్రాక్టులను రద్దు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఐపీఎల్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీకి పూర్తిగా నిబద్ధత చూపడం ప్రతి ఆటగాడి బాధ్యత అని గావస్కర్ స్పష్టం చేశారు. ఫ్రాంచైజీలు భారీ మొత్తాలు పెట్టుబడి పెడుతున్న సమయంలో ఆటగాళ్లు పూర్తి సీజన్‌కు అందుబాటులో ఉండకపోవడం అన్యాయమని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ప్లేయర్ ఫీజులో కొంత భాగం విదేశీ బోర్డులకు వెళ్తున్న నేపథ్యంలో, టోర్నీకి మధ్యలో దూరమయ్యే ఆటగాళ్లపై ఆర్థికపరమైన చర్యలు కూడా అవసరమని ఆయన సూచించారు. ఐపీఎల్ ప్రపంచంలోనే అత్యుత్తమ టీ20 లీగ్‌గా నిలిచిందని, దీనిని గౌరవించడం ప్రతి క్రికెటర్ బాధ్యత అని గావస్కర్ పేర్కొన్నారు.

# ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు ముందు విరాట్ కోహ్లీకి కీలక ఫిట్‌నెస్ టెస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 20:** భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. త్వరలో జరగనున్న ఇంగ్లండ్ పర్యటనలోని వన్డే సిరీస్‌కు ముందు అతడి లభ్యతపై సందిగ్ధత నెలకొంది. దీంతో కోహ్లీకి సంబంధించిన ఫిట్‌నెస్ పరీక్ష ఇప్పుడు కీలకంగా మారింది. ఐపీఎల్ 2026 ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 75 పరుగుల మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ, అదే మ్యాచ్‌లో తొడ కండరాల గాయానికి గురయ్యాడు. ఆ తర్వాత నుంచి ఆయన లండన్‌లో పునరావాసం పొందుతూ కోలుకుంటున్నాడు. తాజాగా కోహ్లీ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఫిట్‌నెస్ అసెస్‌మెంట్‌కు హాజరుకానున్నాడని సమాచారం. ఫిట్‌నెస్ నివేదికలు అనుకూలంగా వస్తేనే ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సమావేశమై జట్టును ప్రకటించనుంది. సెలెక్టర్లు కోహ్లీ ఫిట్‌నెస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని సమాచారం. ఇదిలా ఉండగా, జూలై 14 నుంచి 19 వరకు బర్మింగ్‌హామ్, కార్డిఫ్, లార్డ్స్ వేదికలపై ఈ కీలక వన్డే సిరీస్ జరగనుంది. కోహ్లీ అందుబాటులో ఉంటాడా లేదా అన్నది పూర్తిగా అతని ఫిట్‌నెస్ రిపోర్టులపైనే ఆధారపడి ఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.



ఉద్యమ కెరటం
తెలుగు దినపత్రిక


# మాఇంటి బంగారం ఓపెనింగ్ కలెక్షన్స్ అదుర్స్




సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ. 5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ. 6.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ. 4.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ. 10.70 కోట్లకు చేరింది. రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ. 4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ. 90 లక్షలు, తమిళనాడులో రూ. 38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2ఆ వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఇఖఎఖ ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది. 'ఖుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆ అంచనాలను నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి,శ్రీలక్ష్మి కీలక పాత్రల్లో నటించారు.

# కాక్‌టెయిల్2 కుటుంబ కథా చిత్రం

షాహిద్ కపూర్ హీరోగా రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాక్‌టెయిల్ 2'. ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో దీని సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ కపూర్ మాట్లాడారు. ఇది కుటుంబకథా చిత్రమని దీనికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కాలేదని అన్నారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఆయన దీని గురించి మాట్లాడారు. 'ఈ సినిమాలో అభ్యంతరకరమైన, అసభ్య సన్నివేశాలు ఏవీ లేవు. సినిమా మొత్తంలో అలాంటిది ఒక్క సీన్ కూడా ఉండదు. అలాంటి చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నం చేసినా నాకు అర్థం కావట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగే కథ. కుటుంబ సభ్యులందరితో కలిసి చూసే చిత్రం అని స్పష్టం చేశారు. ప్రేక్షకులు ఈ సినిమా చూసి థియేటర్ నుంచి నవ్వుతూ బయటకు వస్తారని ఆయన అన్నారు. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లెస్బియన్ లవ్‌స్టోరీ అంటూ జరిగిన ప్రచారాన్ని కూడా కృతిసనన్ తాజాగా ఖండించారు. ఈ చిత్రం ముగ్గురు ప్రధాన పాత్రల చుట్టూ తిరిగే ఓ ఎమోషనల్ డ్రామా అని చెప్పారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు రూ. 13 కోట్లు వసూలుచేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ వీకెండ్ కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.






# సోషియో ఫాంటసీగా నాగబంధం

యువ నటుడు విరాట్ కర్ణ, గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ జంటగా నటిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' ట్రైలర్‌ను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పిసిఎక్స్ థియేటర్‌లో యూనిట్ సభ్యుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ పతాకాలపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. ట్రైలర్‌లో చూపించిన విజువల్ ఎఫెక్ట్స్ అన్నీ తెలుగు సాంకేతిక నిపుణులే రూపొందించడం విశేషం. పురాతన ఆలయాలు, గ్రాఫిక్స్ విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మన పురాతన విష్ణు ఆలయాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలు, సనాతన ధర్మం మరియు చారిత్రక అంశాల నేపథ్యంలో మైథాలజీ అడ్వెంచర్ స్పెక్టకిల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాలో విరాట్ కర్ణ శివ తరహా మాస్ లుక్‌లో కనిపించనుండగా, చాలా రోజుల తర్వాత నభా నటేష్ పవర్‌ఫుల్ పాత్రలో మెరవబోతోంది. వీరితో పాటు ఐశ్వర్యా మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జునైద్ కుమార్ మరియు అబీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు భారీ హైప్ తీసుకొచ్చింది. విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు గ్రాండ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని, ప్రతి రూపాయి తెరపై స్పష్టంగా కనిపిస్తుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న చరిత్రను తర్వాత తరాలకు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుందని హీరో విరాట్ కర్ణ చెప్పారు. 'నాగబంధం' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు మలయాళం, తమిళం, హిందీ భాషల్లో జూలై 03న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ప్రేక్షకులను అలరించేలా చిత్రాలు ఉండాల్సిందే



మనం నిర్మించే చిత్రాలు ప్రేక్షకులను అలరించేలా ఉండాలని ప్రముఖ నటి ఖుష్బూ పేర్కొన్నారు. అవ్నీ మూవీస్ పతాకంపై రూపొందిన 'డబుల్ ఆక్యుపెన్సీ' చిత్రం గతవారం విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సక్సెస్‌ను పురస్కరించుకుని తాజాగా చిత్రబృందం చెన్నై నగరంలో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఖుష్బూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఖుష్బూ మాట్లాడుతూ.. 'చిన్న చిత్రం ఇంతటి సక్సెస్ సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. మనం నిర్మించే సినిమా ప్రేక్షకులను అలరించాలి. వారు చెల్లించే డబ్బుకు తగిన విలువ ఉండాలి అని నా భర్త సుందర్ అంటుంటారు. ఈ చిత్రంతో ఆయన మాటలను మేము కూడా నిజం చేశాం. గత కొన్ని రోజులుగా నేను ఎంతో బిజీగా ఉన్నాను. నా పెద్ద కుమార్తె పెళ్ళి పనుల్లో బిజీగా ఉంది. నా భర్త సుందర్ 'పురుషన్' షూటింగ్, పెళ్ళి పనుల్లో క్షణం తీరికలేకుండా ఉన్నారు. నా చిన్న కుమార్తె ఈ చిత్ర నిర్మాణ పనులు చూసుకుంది. ఈ సినిమా నిర్మాణంలో పలు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, వాటిని ఆమె విజయవంతంగా అధిగమించింది. నా పెద్ద కుమార్తె రెండు చిత్రాల్లో నటిస్తోంది. మరో నాలుగు చిత్రాలకు కమిట్ అయింది. గతంలో ఒక హీరోయిన్.. ప్రేమ, పెళ్ళి వంటి అంశాలపై మాట్లాడేందుకు భయపడేది. ఇప్పుడు కాలంతో పాటు అంతా మారిపోయిందని పేర్కొన్నారు.

# చిన్నారి కోరిక తీర్చిన అల్లు అర్జున్



లుకేమియాతో బాధపడుతున్న చిన్నారి శ్రద్ధ కోరికను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తీర్చారు. మేక్-ఎ-విష్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఆమెను కలిసిన అల్లు అర్జున్, 'పుష్ప' సినిమాలోని పాపులర్ మూమెంట్స్‌ను ఆమెతో కలిసి రీక్రియేట్ చేశారు. ఈ హృదయాన్ని హత్తుకునే వీడియోను అల్లు అర్జున్ టీమ్ షేర్ చేయగా, సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. వీడియోలో అల్లు అర్జున్ నవ్వుతూ హాయ్ శ్రద్ధా, ఎలా ఉన్నావ్? అని పలకరించారు. ఆ తర్వాత 'పుష్ప' సినిమాలోని ఐకానిక్ డైలాగ్ చెప్పమని ప్రోత్సహించారు. ఇద్దరూ కలిసి పుష్ప సిగ్నేచర్ బియర్డ్ స్ట్రోక్ చేయగా, అల్లు అర్జున్ చప్పట్లు కొడుతూ 'డ్యామ్ క్యూట్' అని మెచ్చుకున్నారు. చివరగా నువ్వు కోలుకున్న తర్వాత హైదరాబాద్‌కు రా అని చెప్పారు. ఏమవ్వాలనుకుంటున్నావ్ అని అడగగా, శ్రద్ధ డాక్టర్ అవ్వాలని ఉందని బదులిచ్చింది.

# ఫ్రెండ్స్ దర్శకుడు జేమ్స్ బరోస్ కన్నుమూత

హాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందిన 'ఫ్రెండ్స్', 'చీర్స్' వంటి ఐకానిక్ అమెరికన్ సిట్‌కామ్‌ల దర్శకుడు జేమ్స్ బరోస్ కన్నుమూశారు. 85 ఏళ్ల బరోస్ శుక్రవారం రాత్రి నిద్రలోనే ప్రశాంతంగా తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఈ విషాద వార్త తెలియగానే హాలీవుడ్ పరిశ్రమతో పాటు 'ఫ్రెండ్స్' వెబ్ సిరీస్ నటీనటులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ తమ ప్రియమైన దర్శకుడికి నివాళులర్పించారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన కెరీర్‌లో జేమ్స్ బరోస్ దాదాపు 1000కి పైగా టెలివిజన్ ఎపిసోడ్‌లకు దర్శకత్వం వహించి రికార్డు సృష్టించారు. 'జిమ్మీ బరోస్ తాను పనిచేసిన ప్రతి నటుడిలోని ఉత్తమ ప్రతిభను బయటకు తీసేవారు. ఆయన కామెడీని మరింత నవ్వించేలా, ఎమోషన్‌ను మరింత హృదయానికి హత్తుకునేలా మార్చేవారు. ఆయన చూపించిన ఆప్యాయత మాకు ఒక కుటుంబంలాంటి సురక్షితమైన అనుభూతిని ఇచ్చింది' అని డేవిడ్ శ్విమ్మర్ భావోద్వేగంగా రాశారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**